



Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 142 | గురువారం 30 అక్టోబరు 2025 | పేజీలు : 08 | వెల రూ.6.50



## నితీష్ రిమోట్‌తో ప్రభుత్వాన్ని నడుపుతున్న బిజెపి

**పాట్నా , సూర్య వాస్తవం, అక్టోబర్ 29 :** 'నితీష్‌కుమార్' అనే రిమోట్ కంట్రోల్‌తో బీహార్‌లో బిజెపి ప్రభుత్వాన్ని నడుపుతోందని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ బుధవారం విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల కోసం బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలో తన తొలి ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. బీహార్‌లో ప్రభుత్వం రిమోట్ కంట్రోల్‌తో నడుస్తోందన్న ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్ వ్యాఖ్యలతో తాను ఏకీభవిస్తున్నానని అన్నారు. బిజెపి కేవలం రిమోట్‌కంట్రోల్‌గా నితీష్ ముఖాన్ని వినియోగిస్తోందని అన్నారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం సామాజిక న్యాయానికి వ్యతిరేకమని మండిపడ్డారు. ప్రతిపక్షాలు పట్టుబట్టడం వలనే మోడీ ప్రభుత్వం కుల(జన)గణనకు చేపడతామని ప్రకటించిందని అన్నారు. రెండు భారతదేశాలు

- మిగతా 2లో..

# ట్రంప్ అంటే మోడీకి భయం..!



## బీహార్‌లో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన రాహుల్‌గాంధీ

**పాట్నా , సూర్య వాస్తవం, అక్టోబర్ 29 :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అమెరికా అధ్యక్షులు ట్రంప్ అంటే భయమని కాంగ్రెస్ నాయకులు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బుధవారం నుంచి రాహుల్‌గాంధీ తన ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా దర్భంగాలో ఎన్నికల ర్యాలీలో రాహుల్ ప్రసంగించారు. ప్రధాని మోడీపై ఒత్తిడి తీసుకొచ్చి ఆపరేషన్ సిందూర్‌ను ఆపినట్లు ట్రంప్ 50 సార్లు చెప్పుకున్నారని, కానీ, మోడీ దీన్ని ఒక్కసారి కూడా ఖండించలేదని విమర్శించారు. ట్రంప్ అంటే మోడీకి భయమని, ధైర్యం లేనివారు బీహార్‌ను అభివృద్ధి చేయలేరని రాహుల్ అన్నారు. మోడీ స్పందించే ధైర్యాన్ని కూడగట్టుకోవాలని, ఈసారి మోడీ బీహార్‌కు వచ్చినప్పుడు ట్రంప్ అబద్ధం చెబుతున్నారని చెప్పాలని రాహుల్ సవాల్ చేశారు. 'ట్రంప్ ప్రతిరోజూ వివిధ దేశాలలో మోడీని అవమానిస్తున్నారు. మోడీకి ధైర్యం లేదని, మోడీ తనను తన ముందు వంగి నమస్కారం చేస్తారని ట్రంప్ చెబుతున్నారు. అయితే ట్రంప్ అర్థంలేని మాటలు మాట్లాడుతున్నారని, అబద్ధాలు చెబుతున్నారని మోడీ ఎప్పుడూ అనలేదు' అని రాహుల్ చెప్పారు. అలాగే, ముజఫర్‌పూర్‌లోని సక్రాలో జరిగిన బహిరంగ సభలోనూ రాహుల్ ప్రసంగించారు. నీతీశ్ కుమార్‌ను ఎదురుగా పెట్టి బీహార్‌లో బిజెపి రిమోట్ కంట్రోల్ ప్రభుత్వాన్ని నడుపుతుందని విమర్శించారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సామాజిక న్యాయానికి వ్యతిరేకమని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు పట్టుబట్టడం వల్లే మోడీ ప్రభుత్వం కుల గణనకు అంగీకరించిందన్నారు. మహారాష్ట్ర, హర్యానాల్లో ఓట్ల చోరీ జరిగిందని, బీహార్‌లోనూ ఇది పునరావృతమవుతుందని వివమర్శించారు. అలాగే, 'దేశసంపద కొంతమంది సంపన్నుల చేతుల్లోకి వెళ్లిపోతోంది. బీహార్ వంటి ప్రాంతాలు పేదరికంలో కూరుకుపోవడానికి ఇదే కారణం. నోట్ల రద్దు వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టంపై మోడీ మౌనంగా ఉన్నారు. ఛాత్ పూజ సందర్భంగా ఢిల్లీలో యమునా నది ఘాట్ వద్ద పూజలు చేయనున్నట్లు ప్రకటించిన మోడీ, ఆ తర్వాత అది కృత్రిమంగా నిర్మించిందని తెలుసుకుని వెనక డుగు వేశారు' అని రాహుల్ విమర్శించారు. ఓట్ల కోసం ప్రధాని మోడీ ఎంతకైనా వెళ్తారంటూ విమర్శించారు. ఇండియా బ్లాక్ రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉందని రాహుల్ చెప్పారు.



## హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుభేందు బాధ్యతలు స్వీకరణ

**అమరావతి, సూర్య వాస్తవం, అక్టోబర్ 29 :** హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుభేందు సామంత బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాల్లో సభేందుతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ బుధవారం ప్రమాణ స్వీకారం చేయించారు. సుభేందు కోల్‌కతా హైకోర్టు నుంచి రాష్ట్ర హైకోర్టుకు న్యాయమూర్తిగా బదిలీపై వచ్చారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, అడిషనల్ సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు

- మిగతా 2లో..

ముంచెత్తిన మొంథా
- తీరం దాటినా గుంటూరు, నెల్లూరులో భారీ వర్షం
- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, గెడ్డలు
- శ్రీశైలం- కర్నూలు మధ్య రాకపోకలు నిలిపివేత
- నేలవాలిన భారీ వృక్షాలు, విరిగిన విద్యుత్తు స్తంభాలు

: మొంథా తుపాను నిండా ముంచెత్తింది. బలమైన ఈదురుగాలులకు వరి, ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. భారీ వృక్షాలు రహదారిపై నేలవాలడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేలవాలడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. బుధవారం ఉమ్మడి గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షాలు పడ్డాయి. నెల్లూరు జిల్లాలోని కోవూరు, కావలి, జలదంకి, అనంతసాగరం, ఎఎస్‌పేట, తదితర మండలాల్లో ఎడతెరపిలేని వర్షాలు పడ్డాయి. కావలిలో టిడ్కో ఇళ్ల చుట్టూ వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. విడవలూరులో ముంపు గ్రామ వాసులను సురక్షిత ప్రాతాలకు తరలించారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కుండపోతగా వర్షం కురిసింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో 200 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. గుంటూరు జిల్లా కాకుమానులో 116 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. చిలకలూరిపేట వద్ద కప్పగంజి వాగు ఉధృతంగా ప్రహహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. కోటేళ్ల వాగు పొంగి ప్రవహించడంతో అమరావతికి రాకపోకలు నిలిచిపోయాయి. చిలకలూరిపేట, యడ్లపాడు, నాదెండ్ల, వినుకొండ, నర్సరావుపేట పట్టణాల్లోకి నీరు చేరి ప్రజలు ఇబ్బంది పడ్డారు.

ఒంగోలు పట్టణంలో పోతురాజుకాలువకు ఇరువైపులా ఉన్న సుమారు పాతిక కాలనీల్లోకి నీళ్లు చేరాయి. మంగమ్మ కాలేజీ జంక్షన్, ఎంఎన్‌ఆర్ కాలేజీ ఎదురు రోడ్డులో నీళ్లు భారీగా చేరి.. చెరువును తలపించాయి. నగరంలోని ఓ రహదారిపై చిన్నారులు చేపలు పట్టారు. ఒంగోలులోని లోతట్టు కాలనీల్లో మోకాల్లోతు నీళ్లు చేరాయి. పట్టణంలోని జవహర్ నవోదయ పాఠశాలలోకి నీరు చేరడంతో విద్యార్థులు రాత్రంతా నీళ్లలోనే గడిపారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ 14 గేట్లు ఎత్తేశారు. ఒంగోలు, పెళ్లూరు సమీపంలోని చెరువు పొంగడంతో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. శ్రీశైలం, కర్నూలు జిల్లా వైపు రాకపోకలు నిలిచిపోయాయి. నల్లమలలోనూ భారీ వర్షం కురవడంతో కంభం చెరువు నిండింది. చీమకుర్తి క్వారీల్లో పెద్దఎత్తున నీరు నిలిచిపోవడంతో పనులకు ఆటంకం ఏర్పడింది.

విశాఖపట్నం భీమిలి మండలం చిప్పాడ గ్రామానికి వెళ్లే రహదారి

# ప్రాణ నష్టాన్ని నివారించాం



- ముఖ్యమంత్రి చంద్రబాబు
- తుపాను బాధిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే
- ఓడలరేవులో బాధితులకు పరామర్శ

**అమలాపురం, :** మొంథా తుపాను సందర్భంగా రాష్ట్రంలో ప్రాణ నష్టాన్ని నివారించగలిగామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. బుధవారం ఆయన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఏరియల్ సర్వే చేశారు. అనంతరం అల్లవరం మండలం ఓడలరేవులో పర్యటించారు. తుపాను పునరావాస కేంద్రంలో బాధితులను పరామర్శించారు. నిర్వాసితులకు ఆర్థిక సాయం, బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. బెండమూర్లంక శివారు అరకట్లపాలెం ప్రాంతంలో తుపానుకు పాడైన వరి పొలాలను పరిశీలించారు. నష్టంపై రైతులను ఆరా తీశారు. బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మురుగు నీటి డ్రెయిన్లు పూడుకుపోవడంతో తరచూ పొలాలు ముంపునకు గురవుతున్నాయని ఈ సందర్భంగా పలువురు రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డ్రెయిన్ల పూడికతీత పనులను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ నష్టపోయిన రైతులందర్నీ ఆర్థికంగా ఆదుకుంటామన్నారు. కోనసీమ ప్రాంతం పెనుముప్పు నుంచి బయటపడిందని పేర్కొన్నారు. కొద్దిపాటి నష్టాలతో రైతులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారన్నారు. ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యల వల్ల చాలావరకూ ప్రాణ నష్టాన్ని నివారించగలిగామని, ఆస్థి నష్టాన్ని కూడా చాలా దరకు తగ్గించగలిగామని చెప్పారు. మొబైల్ క్లినిక్స్ ద్వారా బాధితులకు వైద్యసాయం అందించే చర్యలు చేపట్టామన్నారు. నేలకొరిగిన కొబ్బరి, భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలను తొలగించి రవాణా, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేపట్టామని తెలిపారు. పంట నష్టం వివరాలను త్వరగా సేకరించాలని అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావం రాష్ట్రంలో ఇతర జిల్లాలపైనా ఇంకా కనిపిస్తోందన్నారు.

## ముంపు ప్రాంతాల్లో రెడ్ క్రాస్ సొసైటీ సేవలు..!

- పలు ప్రాంతాల్లో టార్పాలిన్లు,దుప్పట్ల పంపిణీ
- నగరంలో విస్తృత పర్యటన

**సూర్య వాస్తవం, ప్రతినిధి: విజయవాడ, అక్టోబర్ 29:** తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ విశేష సేవలు అందిస్తుంది. విజయవాడ నగరంలోని పల్లపు ప్రాంతాల్లో నీటిముంపునకు గురైన కుటుంబాలను బుధవారం ఉదయం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించింది. పూరిగుడిసెలు, రేకుల షెడ్డులో ఉంటున్న నిరుపేదలకు దుప్పట్లు, టవల్స్,టార్పాలిన్స్ అందించారు రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ చైర్మన్ డాక్టర్ జి.సమరం, వై చైర్మన్ డాక్టర్ వెలగా జోషి, సెక్రెటరీ చిట్టిబాబు, సభ్యులు బలరాం ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. నగరంలోని ముంపునకు గురైన వేరువేరు ప్రాంతాలను రెడ్ క్రాస్ సొసైటీ కమిటీ విస్తృతంగా పర్యటించింది. ఆయా ప్రాంతాల్లో నిరుపేదలకు అవసరమైన అంశాల గుర్తించి అధ్యయనం చేసింది. ఆటోనగర్ ప్రాంతంలోని పలు కుటుంబాలకు టార్పాలిన్లు, దుప్పట్లు, టవల్స్

- మిగతా 2లో..




సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి



# దగ్గుపాటి మార్క్ పాలన

- ప్రభుత్వాసుపత్రిలో ఎమ్మెల్యే దగ్గుపాటి ఆకస్మిక తనిఖీలు
- ఓపీ చీటీలు ఇవ్వడం దగ్గర నుంచి ప్రతి విభాగం తనిఖీ
- వైద్యులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవన్న ఎమ్మెల్యే
- త్వరలో 1200 పడకల ఆసుపత్రిగా మారుస్తామన్న దగ్గుపాటి
- సిబ్బంది ఎక్కడైనా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సస్పెన్షన్ తప్పదని హెచ్చరిక



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం, అక్టోబర్ 29**

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ పాలనలో తన మార్క్ చూపిస్తున్నారు. ప్రభుత్వ ప్రక్షాళన విషయంలో తన వైఖరి ఏంటో స్పష్టం చేస్తూ జిల్లాలో తనదైన ముద్రవేసుకోవడానికి అడుగులు వేస్తున్నారు. పూర్తి స్థాయిలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి లోని వైద్య సేవల విభాగాలపై దృష్టి సారించారు. బుధవారం నాడు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకస్మికతనిఖీ నిర్వహిం చారు. గైనికల్ వార్డులు తిరుగుతు రోగుల యొక్క ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటూ వారికి మెరుగైన వైద్యం అందించాలని అక్కడ ఉన్న వైద్య సిబ్బందిని ఆదేశించారు.జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హెచ్చరించారు. బుధవారం ఉదయం ఆయన ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపి స్లిప్పులు ఇచ్చే గదుల దగ్గర నుంచి అన్ని విభాగాలను ఆయన పరిశీలించారు. ప్రతి ఓపీని, వార్డులను, ఫార్మసీను కూడా పరిశీలించారు. రోగులతో మాట్లాడి అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. చాలా విభాగాల్లో 9:30 అయినా వైద్యులు రాకపోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎందుకు ఇంత సమయమైనా వైద్యులు రావడం లేదు, ఎంతవరకు ఓపి నడుస్తుంది అన్న అంశాలపై సూపర్డెంట్ తో మాట్లాడారు. మరోసారి వైద్యులు ఇలా సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ ను ఆదేశించారు. అలాగే ఆసుపత్రిలో ఎంత మంది ఇన్ పేషెంట్లు ఉన్నారు.. ప్రతిరోజు ఔట్ పేషెంట్లు ఎంత వరకు వస్తున్నారన్నది కూడా తెలుసుకున్నారు. అక్కడున్న సౌకర్యాలపై కూడా ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్య సేవలు సంతృప్తికరంగా ఉన్నప్పటికీ.. గత 20 ఏళ్ల నుంచి ప్రభుత్వాసుపత్రి 560 పడకలగా మాత్రమే ఉండటం వలన ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ప్రతిరోజు ఇన్ పేషెంట్లు 2000 నుంచి 200500 మంది వరకు ఉన్నారని.. అలాగే ఔట్ పేషెంట్లు 1200 మంది వరకు వస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆసుపత్రికి వచ్చే బడ్జెట్, వైద్యులు, సిబ్బంది, సౌకర్యాలు చాలడంలేదన్నారు. ఇదే అంశాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కూడా చర్చించామని, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. త్వరలోనే 1200పడకల ఆసుపత్రిగా మారుస్తామని స్పష్టం చేశారు. సిబ్బంది ఎక్కడైనా రోగుల వద్ద నుంచి డబ్బులు తీసుకున్నా.., విధుల్లో నిర్లక్ష్యం వహించిన, వైద్యులు సమయపాలన పాటించకపోయినా గట్టి చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే దగ్గుపాటి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ హాస్పిటల్ సూపర్డెంట్ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ గుజ్జల హేమలత, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కోనంకి గంగారం, రత్నమయ్య పాల్గొన్నారు.

# ముంపు ప్రాంతాల్లో రెడ్ క్రాస్ సొసైటీ సేవలు..!

(మొదటిపేజీ తరువాయి)
ఉచితంగా పంపిణీ చేసింది. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ చైర్మన్ డాక్టర్ జి సమరం మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు దేశవ్యాప్తంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ విస్తృతమైన సేవలు అందిస్తుందని అన్నారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితిలో సైతం రెడ్ క్రాస్ సొసైటీ సాహసోపేతంగా సేవలు అందించి ఎంతో మంది ప్రాణాలను కాపాడిందని గుర్తు చేశారు . గడిచిన కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, తుఫాను ప్రభావం వల్ల ముంపునకు గురైన ప్రాంతాల్లో పర్యటించి వారి అవసరాలను తెలుసుకొని వాటిని తీర్చే ప్రక్రియ చేపట్టామన్నారు. వైస్ చైర్మన్ డాక్టర్ వెలగా జోషి మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ జిల్లాలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. గడిచిన కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల పు ప్రాంతాలకు పంపు ప్రాంతాల్లోని నిరుపేదలకు అవసరమైన తార్పాలిన్లు దుప్పట్లు టవల్స్ అందించామని ఆయన తెలిపారు. ఇవే కాకుండా అత్యవసర సమయాల్లో రక్తదాన కార్యక్రమాలు కూడా చేపడుతున్న అంశాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కె.బి.ఎన్ కాలేజి విద్యార్థులు పాల్గొన్నారు.

## నితీష్ రిమోట్‌తో ప్రభుత్వాన్ని నడుపుతున్న బిజెపి

(మొదటిపేజీ తరువాయి)
రానున్నాయని, ఒకటి సామాన్య ప్రజల కోసం, మరొకటి ఐదుగురు లేదా పది మంది బిలియనీర్ల కోసమని అన్నారు. ఈ విధానం కారణంగానే బీహార్ వంటి ప్రాంతాలు పేదరికంలో మునిగిపోయాయని మండిపడ్డారు. బీహార్ పూర్తి సామర్థ్యం వినియోగించకోవడం లేదని అన్నారు. బీహార్‌లోని నలంద యూనివర్శిటీ గురించి ప్రస్తావిస్తూ.. ఇక్కడి నుండి యువత దుబారు, మారిషస్, సీషెల్స్, అమెరికా వెళు తున్నారని అన్నారు. చఠ్‌పూజ సందర్భంగా యమునా నదిలో స్నానం చేయబోతున్నానని ప్రకటించడం ద్వారా ప్రధాని మోడీ ప్రదర్శించాలనుకున్న నాటకాన్ని అందరం చూశామని అన్నారు. అయితే అవి పైపుల నుండి వచ్చిన నీటి వనరు అని తేలడంతో మోడీనే ఆశ్చర్యపోయారని ఎద్దేవా చేశారు. ప్రధాని నాటకాలకు మోసపోవద్దని, ఓట్లు తెచ్చిపెడుతుందని భావిస్తే.. వేదిక మీద నృత్యం చేయడానికి కూడా సిద్ధమవుతారని విమర్శించారు.

మోడీ ప్రజలకు చౌకగా డేటాను అందుబాటులో ఉంచామని గొప్పలు చెప్పారని, కానీ టెలికాం రంగంలో ఒకే వ్యాపార సంస్థ గుత్తాధిపత్యం ఉందనే వాస్తవాన్ని దాచిపెడుతున్నారని మండిపడ్డారు. నోట్లరద్దుతో ఆర్థికవ్యవస్థ విధ్వంసంపై ప్రధాని ఇప్పటికీ మౌనంగానే ఉన్నారని అన్నారు. ఇండియా బ్లాక్ కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే.. కుల, మతాలకు అతీతంగా సమాజంలోని అన్ని వర్గాల ప్రయోజనాలను నెరవేరుస్తుందని హామీ ఇచ్చారు. ఓట్ల దొంగతనం అంబేద్కర్ రచించిన రాజ్యాంగంపై దాడి అని, రాజ్యాంగాన్ని రక్షించడానికి తాము కట్టుబడి ఉంటామని అన్నారు.

## హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుభేందు బాధ్యతలు స్వీకరణ

(మొదటిపేజీ తరువాయి)
కె చిదంబరం, ఎపి బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఎన్ ద్వారకానాథ్ రెడ్డి, అదనపు అడ్వకేట్ జనరల్ ఇ సాంబశివ ప్రతాప్, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పొన్నారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం లక్ష్మీనారాయణ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారధి తదితరులు పాల్గన్నారు.

## వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై జోక్యం చేసుకోలేం

**అమరావతి - సూర్య వాస్తవం, అక్టోబర్ 29 :** వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో జోక్యానికి హైకోర్టు అంగీకరించలేదు. బిడ్డింగ్ ప్రక్రియ తుది దశకు చేరుకుందని గుర్తు చేసింది. థర్డ్ పార్టీ హక్కులు ఏర్పడే దశలో జోక్యం చేసుకోవాలన్న పిటిషనర్ వినతిని తోసిపుచ్చింది. ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చి చెప్పింది. ప్రైవేటీకరణ ప్రభుత్వ విధాన నిర్ణయమని చెప్పింది. విధానపర నిర్ణయాల్లో కోర్టుల జోక్యానికి ఆస్కారం తక్కువని పేర్కొంది. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను నవంబరు 19కు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశించింది. రాష్ట్రంలో 10 వైద్య కళాశాలలను పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) విధానంలో అభివృద్ధికి ప్రభుత్వం జిఓ 590 జారీ చేయడం రాజ్యాంగ విరుద్ధమంటూ గుంటూరు జిల్లా, తాడేపల్లికి చెందిన సామాజిక కార్యకర్త డాక్టర్ కె వసుంధర పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరపున సీనియర్ అడ్వకేట్ ఎస్ శ్రీరామ్ వాదిస్తూ, ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు ఉచిత, నామమాత్రపు ధరలకే వైద్యం అందాలన్నారు. ప్రైవేటీకరణ వల్ల కార్పొరేట్ ఆస్పత్రుల్లో మాదిరిగా భారీ ఫీజులు ఉంటాయన్నారు. భారత్ అల్యూమినియం కంపెనీ మాదిరిగా కాకుండా చేయాలంటే జోక్యం చేసుకోవాలని ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. 33 ఏళ్ల పాటు ప్రభుత్వ వైద్య థర్డ్ పార్టీ హక్కులపై మధ్యంతర ఉత్తర్వులివ్వలేమని హైకోర్టు వెల్లడించింది. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించి విచారణను వచ్చే నెల 19కి వాయిదా వేసింది.

## ప్రజా సంక్షేమమే పరమావధిగా కేరళ ముందడుగు

**తిరువనంతపురం - సూర్య వాస్తవం, అక్టోబర్ 29 :** కేరళలోని వామపక్ష ప్రజాతంత్ర ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) ప్రజలకు ఇచ్చిన హామీలన్నిటినీ ఒక్కొటొక్కటిగా నిలబెట్టుకుంటూ ప్రజా సంక్షేమమే పరమావధిగా దేశానికే ఆదర్శనీయమైన పాలన అందిస్తోంది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆర్థికంగా అనేక అడ్డంకులు సృష్టించినా నిధులు కేటాయించకుండా వివక్ష చూపినా.. ఆ ఇబ్బందులన్నిటినీ అధిగమిస్తూ కేరళ ప్రభుత్వం ముందడుగేస్తోంది. 2021లో అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి మంత్రివర్గ సమావేశంలోనే రాష్ట్రంలో అత్యంత పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించాలని నిర్ణయించింది. ఇప్పుడు ఆ లక్ష్యాన్ని పూర్తి చేసి .. దేశంలోనే మొట్టమొదటి అతి పేదరిక రహిత రాష్ట్రంగా కేరళను నిలిపింది. కేంద్ర ప్రభుత్వం నిధులు నిరాకరించి ఆర్థిక ఇబ్బందులు సృష్టించడమే గాకుండా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మూకలు తప్పుడు కథనాలు వల్లిస్తూ దుష్ప్రచారానికి ఒడిగడుతున్నాయి. ఆ అవరోధాలన్నిటినీ దిగ్విజయంగా జయించి ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ ముందుకెళ్తోంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సంక్షేమ పెన్షన్లు పెంపు, రబ్బరు రైతులకు రాయితీలు, ఆశా వర్కర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, ఫ్రంట్ లైన్ కార్మికులకు వేతనాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అనంతరం కేబినెట్ నిర్ణయాలను విజయన్ మీడియాకు వెల్లడించారు. నవంబర్ 1న కేరళ ఆవిర్భావ దినోత్సవ నేపథ్యంలో ప్రజలందరికీ సంక్షేమ వరాలు కురిపించారు. సామాజిక పింఛన్లను రూ. 1600 నుంచి రూ 2 వేలకు పెంచారు. దీని కోసం ప్రభుత్వం రూ.13 వేల కోట్లను ఖర్చుచేయనుంది. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు గౌరవ వేతనాన్ని రూ 1000 పెంచారు. దీంతో వారు గౌరవ వేతనం రూ.13000లు అందుకోనున్నారు. గెస్ట్ లెక్చరర్లకు నెలకు గరిష్టంగా 2 వేలు రూపాయిల మేరకు జీతం పెరుగుతోంది. కనెక్ట్ టు వర్క్ పథకం ద్వారా 18–35 వయస్సు ఉన్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆర్థిక సహాయాన్ని అందించనుంది. రైతు కుటుంబాలకు రూ.19,470 సబ్సిడీని ప్రకటించింది. మద్దతు ధరను రూ.30 వరకూ పెంచారు. అలాగే, ఆశా వర్కర్ల గౌరవ వేతనాన్ని రూ 1000 పెంచారు. మహిళలకు, యువతకు నెలకు రూ 1000 ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. వెనుకబడిన కుటుంబాలకు చెందిన 35 నుంచి 60 ఏళ్ల మహిళలకు నెలకు రూ 1000 ఆర్థిక సాయం చేయనున్నారు. రేషన్‌కార్డును దీనికి అర్హతగా నిర్ణయించారు. అదేవిధంగా కుటుంబ ఆదాయం రూ 1 లక్ష కంటే తక్కువగా ఉన్న యువతకు నెలకు రూ. 1000 అందిచనున్నారు. ఇంటర్ లేదా ఐటిఐ, డిప్లొమో, డిగ్రి కోర్సుల పూర్తి చేసిన వారు, వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేస్తున్నవారు, పోటీ పరీక్షలకు సిద్ధ పడుతున్న అభ్యర్థులకు కూడా ఈ సాయం అందిస్తారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయలు, పెన్షనర్లకు నవంబర్ నుంచి 4 శాతం డిఎను పెంచారు. 13,327 మంది ఆహార సేవా కార్మికుల రోజువారీ వేతనాన్ని రూ 50 పెంచారు. రబ్బరు మద్దతు ధరను కిలోకు రూ 180 నుంచి రూ 200కు పెంచారు.కోవిడ్ కారణంగా ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తూ ప్రారంభించిన ఆహార పంపిణీని కొనసాగించింది. కేంద్ర ప్రభుత్వం నుండి ఆర్థిక సహకారం అందకపోయినా ఒడిదుడుకులను తట్టుకుంటూ కేరళ ప్రభుత్వం సంక్షేమాన్ని కొనసాగిస్తుందని ఆర్థిక మంత్రి కె.బాలగోపాల్ తెలిపారు..

# సంపాదకీయం

## మోడీ హత్యకు కుట్ర జరిగిందా?

అతిపెద్ద ప్రజాస్వామ్యానికి ప్రధానమంత్రిగా ఉన్నారు నరేంద్ర మోడీ. అంతేకాదు అమెరికా లాంటి దేశాలను సైతం సవాల్ చేస్తూ ముందుకు దూసుకెళ్తున్నారు. స్నేహాన్ని ఇతర దేశాలతో కొనసాగిస్తూనే.. అవసరమైన సందర్భాల్లో భారత సైనిక సత్తాను ఇతర దేశాలకు అర్థమయ్యేలా చెబుతున్నారు. రక్షణ రంగంలో.. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో.. వైద్యరంగంలో అనేకమార్పులకు శ్రీకారం చుడుతున్నారు. ఒకరకంగా ఆధునిక భారత్ ను నిర్మిస్తున్నారు నరేంద్ర మోడీ. అమెరికా నుంచి మొదలు పెడితే ఆఫ్రికా వరకు భారతదేశంతో గతంలో ఉన్న దానికంటే గొప్పగా దౌత్య సంబంధాలను మెరుగుపరిచారు.అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత.. భారత్ మీద లేని విషాన్ని కక్కుతున్నారు. అనవసరమైన ఆంక్షలు విధిస్తూ ఇబ్బంది పెడుతున్నారు. ఈ క్రమంలో భారత్ తన స్వీయ సాధికారతను సాధించుకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగానే అన్ని దేశాలతో వ్యాపార భాగస్వామ్యాలను మెరుగుపరుచుకుంటున్నది. ఎగుమతుల విషయంలో స్పష్టమైన వైఖరిని అవలంబిస్తున్నది. ఇది సహజంగానే అమెరికాకు కంటగింపుగా మారింది. అందువల్లే అమెరికా లేనిపోని కుట్రలను భారత ప్రధాని మీద చేస్తున్నట్టు కనిపిస్తోంది. ఈ క్రమంలో చైనా లో షాంగై సదస్సుకు ప్రధానమంత్రి వెళితే.. ఓ గుర్తుతెలియని వ్యక్తి హత్యకు ప్రయత్నించినట్టు తెలుస్తోంది. అయితే దానిని రష్యా, చైనా వ్యూహాత్మకంగా తిప్పి కొట్టాయని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. మోడీపై హత్యకు ప్రయత్నించిన ఆ వ్యక్తి బంగ్లాదేశ్లో అత్యంత అనుమానాస్పదంగా చనిపోయాడు. అతని వద్ద భారీగా నగదు లభ్యమైంది.వాస్తవానికి ఈ విషయాన్ని నరేంద్ర మోడీ నేరుగా చెప్పలేదు. ఈ విషయాన్ని బయట పెట్టడంలో ఆయన అత్యంత చాకచక్యంగా వ్యవహరించారు. సద్దాం హుస్సేన్ లేదా గడాఫీ లాగా అమెరికాపై విమర్శలు చేయలేదు. కేవలం పత్రికల ద్వారానే ఈ వార్తను లీక్ చేయించారు. హత్యాయత్నం జరిగిన మాట వాస్తవం. అయితే రష్యా ప్రయత్నం వల్ల ఇది ఆగిపోయిందని ప్రజలకు తెలిసే మాదిరిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేశారు.మనదేశంలో 1966, 1984 తర్వాత ప్రధానమంత్రి పై జరిగిన మూడవ హత్యాయత్నం.. ఒకవేళ నరేంద్ర మోడీని చంపడం లేదా తొలగించేందుకు ప్రయత్నాలు గనుక జరిగితే.. దీనికి గనక ప్రతిపక్షం సహాయం చేస్తోందని కేంద్రం కనుక ప్రకటిస్తే.. ఆ తర్వాతి పరిణామాలు అత్యంత దారుణంగా ఉంటాయి. ఒకవేళ గనుక రాహుల్ గాంధీ బడాయి మాటలు మాట్లాడి.. నరేంద్ర మోడీపై దాడి జరిగితే.. ఆ సమయంలో రాహుల్ గాంధీ ద్వేషాన్ని గనక వ్యాప్తి చేస్తే.. అప్పుడు జరిగే పరిణామాల వల్ల కాంగ్రెస్ కార్యకర్తలు తీవ్రంగా ఇబ్బంది పడతారు..రాహుల్ గాంధీకి రక్షణ ఉన్నప్పటికీ.. కాంగ్రెస్ కార్యకర్తలు బిజెపి, ప్రజల ఆగ్రహానికి ఖచ్చితంగా గురవుతారు. ఇది కాంగ్రెస్ పార్టీని పెనం నుంచి పొయ్యిలోకి లాగే ప్రయత్నం లాంటిదే.. అయితే ఈ కుట్ర వెనుక రాహుల్ గాంధీ పేరు వినిపించడం లేదు. ఇటీవల అమెరికాకు రాహుల్ గాంధీ వెళ్లారు. ఆయన కొంతమంది వ్యక్తులను కలిశారు. అయితే ఆ వ్యక్తులను అక్కడి డీప్ స్టేట్ కూడా ఇష్టపడకపోవడం విశేషం. అమెరికాలో కూడా రాహుల్ గాంధీకి విశ్వసనీయత లేకపోవడం అత్యంత బాధాకరం. ఇక అమెరికా కూడా ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రభుత్వాలను కూల్చింది. హమీద్ కర్జాయ్, మహమ్మద్ యూసఫ్ లాంటి వ్యక్తులను మాత్రమే గద్దెనెక్కించింది. దీనిని బట్టి అమెరికా ప్రణాళిక ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ మన దేశ ప్రజలు ఇలాంటి ఉద్రిక్తతలో సమయమనం పాటించాలి. పుతిన్–మోదీ భేటీ జరిగిన ఆగస్టు 31వ తేదీనే, బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని ఓ హోటల్లో టెర్రెన్స్ జాన్సన్ అనే ఉన్నత స్థాయి అమెరికన్ అధికారి అనుమానాస్పద స్థితిలో మరణించాడు. ఇతను అమెరికన్ ఆర్మీలో 20 ఏళ్ల అనుభవం ఉన్న, 'స్పెషల్ ఆపరేషన్స్ ఆఫ్ ఆసియా' విభాగానికి చెందిన కీలక వ్యక్తి అని సమాచారం. మోదీపై కుట్రను అమలు చేసే ఆపరేషన్ కోసమే టెర్రెన్స్ జాన్సన్ కొద్ది నెలలుగా ఢాకాలో మకాం వేశాడని, అక్కడి నుంచి కొందరు తీవ్రవాదులను భారత్లోకి పంపేందుకు సిద్ధం చేశాడని ఈ విశ్లేషణలు ఆరోపిస్తున్నాయి. అయితే ఎలాంటి పోస్ట్మార్టం నిర్వహించకుండా, ఈ మరణాన్ని 'సహజ మరణం'గా చిత్రీకరించి, అమెరికా అధికారులు అతని మృతదేహాన్ని హడావుడిగా తరలించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పుతిన్ నుండి అందిన పక్కా సమాచారంతో భారత 'రా' లేదా రష్యా ఇంటెలిజెన్స్ ఏజెంట్లు రంగంలోకి దిగి, అసలు కుట్ర అమలు కాకముందే ఢాకాలోని అమెరికన్ అధికారిని 'ఎలిమినేట్' చేసి ఉండవచ్చని గట్టిగా ప్రచారం జరుగుతోంది. సమ్మిట్ ముగించుకుని భారత్ వచ్చిన తర్వాత, ప్రధాని మోదీ తీవ్రవాదంపై మాట్లాడుతూ.. "కొన్ని దేశాలు తీవ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నాయి. వారే అసలైన తీవ్రవాదులు" అని వ్యాఖ్యానించడం ఈ సంఘటనలకు బలం చేకూరుస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటన తర్వాతే ప్రధాని మోదీ, డొనాల్డ్ ట్రంప్తో భేటీని కూడా రద్దు చేసుకున్నారని గుర్తుచేస్తున్నారు. అయితే ఈ సంచలనాత్మక కథనాలను భారత్, రష్యా, అమెరికా, బంగ్లాదేశ్ ప్రభుత్వాలు అధికారికంగా ధృవీకరించలేదు. ఇవి కేవలం వెరిఫైడ్ సోర్సులు లేని జియో–పొలిటికల్ థియరీలు మాత్రమేనని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారుదేశంలో అరాచకం సృష్టించకుండా ఉండాలి.. ఇప్పుడు ఇక చైనా అధ్యక్షుడు జీ జిన్ పింగ్ తన వ్యతిరేకుల మీద యుద్ధాన్ని మొదలుపెట్టాడు. ఏకంగా చంపడాన్ని కూడా ప్రారంభించాడు. తనపై హత్యాయత్నం జరిగిన తర్వాత.. దానికి పాల్పడిన వ్యక్తి బంగ్లాదేశ్లో అత్యంత అవమానకరంగా చనిపోయాడు. ఈ ప్రకారం నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్న వారికి ఎటువంటి ట్రీట్మెంట్ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదనుకుంటా.

# పొగాకు వద్దంటే వినరే...



**గుంటూరు, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** ప్రభుత్వం వద్దన్నా రైతులు బర్లీ పొగాకు సాగును ఆపడం లేదు. ఖరీఫ్ లో 21 వేల ఎకరాల్లో సాగు చేయగా, అందులో 15 వేల ఎకరాలు బర్లీ పొగాకే. కొనుగోలుదారుల స్పష్టత లేక, ధరలు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం కొనుగోళ్లు చేపట్టినా, సమస్య తీరడం లేదు. రబీలోనూ సాగు పెరిగే అవకాశం ఉంది.ఆంధ్రప్రదేశ్లో ప్రభుత్వం వద్దని చెప్పినా రైతులు వినడం లేదు.. నిషేధించినా సరే వెనక్కు తగ్గడం లేదు. రాష్ట్రంలో రైతులు బర్లీ పొగాకు సాగు ఆగడం లేదు. ఈసారి ఖరీఫ్ సీజన్లో ఇప్పటికే 21 వేల ఎకరాల్లో రైతులు ఈ బర్లీ పొగాకు వేశారు. అత్యధికంగా ప్రకాశం జిల్లాలో 11,400 ఎకరాల్లో, పల్నాడు జిల్లాలో 4,600 ఎకరాల్లో, కర్నూలు జిల్లాలో 4,000 ఎకరాల్లో బర్లీ పొగాకు సాగు చేశారు. మొత్తం 21 వేల ఎకరాల్లో, 15 వేల ఎకరాలు బర్లీ పొగాకే. ఎఫ్సీవీ (ఫుల్ క్యూర్డ్ వర్జీనియా పొగాకు) రకం కేవలం 6 వేల ఎకరాల్లోనే సాగైంది.. ఏడు జిల్లాల్లో కొద్ది విస్తీర్ణంలో సాగు చేశారు. మొత్తం 21 వేల ఎకరాల్లో.. 6 వేల ఎకరాలు ఫుల్ క్యూర్డ్ వర్జీనియా పొగాకు (ఎఫ్సీవీ) రకం కాగా.. మిగిలిన 15 వేల ఎకరాలు బర్లీ పొగాకు. ఈ పొగాకును ఎవరు కొనుగోలు చేస్తారు.. ఎంత ధరకు కొనుగోలు చేస్తారో కూడా క్లారిటీ లేదు.చాలామంది రైతులు మరే పంట వేయాలో తెలియక చాలామంది పొగాకు సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే.. రబీ సీజన్లో కూడా బర్లీ పొగాకు సాగు మరింత పెరిగే అవకాశం ఉంది. అప్పుడు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. గతేడాది క్వింటాలుకు రూ.15 వేలు పలికిన బ్లాక్ బర్లీ, వైట్ బర్లీ పొగాకు ధరలు ఈ ఏడాది గణనీయంగా పడిపోయాయి. వ్యాపారులు కొనుగోలు చేయడానికి ముందుకు రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతుల కష్టాలను గుర్తించిన ప్రభుత్వం, వారిని ఆదుకోవడానికి ముందుకు వచ్చింది. మార్క్ఫెడ్ ద్వారా 19.73 మిలియన్ కిలోల బ్లాక్ బర్లీని కొనుగోలు చేసింది. క్వింటాలుకు రూ.12 వేలు ధర నిర్ణయించినా, చాలా మంది రైతులకు ఆ ధర కూడా దక్కలేదు. కొనుగోలు ప్రక్రియలో ధరలో కోత పడిందని రైతులు చెబుతున్నారు.ప్రైవేట్ వ్యాపారుల ద్వారా మరో 50 మిలియన్ (5 కోట్ల) కిలోల పొగాకును కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయినప్పటికీ, ఇంకా చాలా మంది రైతుల ఇళ్లలో పొగాకు అమ్ముడుపోకుండానే మిగిలిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైట్ బర్లీ సాగు చేసిన రైతులు కూడా ఈ ఏడాది నష్టాలనే ఎదుర్కొన్నారు. గత ఏడాది క్వింటాలుకు రూ.15 వేలు లభించిన ధర, ఈ ఏడాది రూ.12 వేల నుంచి అతికష్టం మీద మాత్రమే రూ.15 వేలకు చేరింది. అంటే ధరలో పెద్దగా పెరుగుదల లేదని, కొందరు రైతులు రూ.12 వేలకే అమ్ముకోవాల్సి వచ్చిందని చెబుతున్నారు. కర్నూలు, నంద్యాల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో వైట్ బర్లీ పొగాకు సాగు ఎక్కువగా ఉంది. ఈ జిల్లాలలోని రైతులు ఈ ధరల పతనంతో తీవ్రంగా నష్టపోయారు. వ్యాపారులు ముందుకు రాకపోవడం, ప్రభుత్వ కొనుగోళ్లు కూడా ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఏపీ ప్రభుత్వం హెచ్డీ బీఆర్జీ, హెచ్డీ బర్లీ, బ్లాక్ బర్లీ వంటి పొగాకు రకాల సాగును నియంత్రించింది. ఈ నియంత్రణలో భాగంగా, జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్డీవో, మండల స్థాయిలో తహసీల్దార్ల నేతృత్వంలో టాస్క్ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేశారు.

# సొంత జిల్లాపై టీడీపీ అధినేత ఫుల్ ఫోకస్



తిరుపతి, సూర్య వాస్తవం, అక్టోబర్ 29: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు అంతర్గత సంక్షోభంలో కూరుకుపోయాయి. అధికారంలోకి వచ్చి నెలలు గడిచినా, స్థానిక నాయకత్వం కొరవడడం, ముఖ్యంగా ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు ఇన్ఛార్జ్ బాధ్యతలు అప్పగించడం పార్టీ క్యాడర్ను కలవరానికి గురిచేస్తోంది. తంబళ్లపల్లి, తిరుపతి, సత్యవేడు, పుంగనూరు? ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ ఇన్ఛార్జ్ల పనితీరుపై క్యాడర్ తీవ్ర అసంతృప్తితో ఉందట. అధికారం ఉన్నా తమను తాము రక్షించుకోలేని స్థితిలో ఉన్నామంటూ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. ఈ నేపథ్యంలో జిల్లాలో పార్టీని మళ్లీ గాడిలో పెట్టేందుకు అధినేత చంద్రబాబు ఏ మేరకు కఠిన నిర్ణయాలు తీసుకుంటారనే దానిపైనే ఉమ్మడి చిత్తూరు భవిష్యత్తు ఆధారపడి ఉంది. ఇన్ఛార్జ్ల నియామకం, పనితీరుపై అసంతృప్తి:. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ క్షేత్రస్థాయిలో తీవ్రమైన నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ముఖ్యంగా ఇన్ఛార్జ్ల నియామకం, వారి పనితీరుపై పార్టీ క్యాడర్ తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నదట. నాలుగు కీలక నియోజకవర్గాల్లో పరిస్థితి 'చుక్కాని లేని నావ' వలె మారిందట. ఈ సంక్షోభానికి ప్రధాన కారణం, ఇతర పార్టీల నుంచి అరువు తెచ్చుకున్న నేతలకు కీలక పదవులు ఇవ్వడం, వారు లోకల్ నాయకులను విస్మరించి, తమ సొంత కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వడమేనని క్యాడర్ ఆరోపిస్తోంది. శంకర్ యాదవ్, దొరస్వామి నాయుడు ప్రయత్నాలు:. తంబళ్లపల్లి నియోజకవర్గంలో పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది. గత ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి టీడీపీలో చేరి టికెట్ పొందిన జయచంద్రారెడ్డి ఇటీవలే నకిలీ మద్యం వ్యవహారంలో చిక్కుకోవడంతో పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. ఆయన పార్టీలో చేరిన సమయంలోనే స్థానిక క్యాడర్ తీవ్రంగా వ్యతిరేకించినా, కడప జిల్లాకు చెందిన కొందరు నేతల సహకారంతో టికెట్ సంపాదించారట. గత 16 నెలలుగా ఆయన పార్టీ శ్రేణులను అనేక ఇబ్బందులకు గురిచేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇన్ఛార్జ్ నియామకం కంటే, సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని స్థానిక క్యాడర్ పట్టుబడుతోందట. మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ కుమార్ రెడ్డి తిరిగి వస్తారని ప్రచారం జరుగుతున్నా, గతంలో ఆయన చంద్రబాబుపై చేసిన విమర్శల కారణంగా టీడీపీ కార్యకర్తలు అంతగా ఇంట్రెస్ట్ చూపట్లేదట. మరోవైపు, శంకర్ యాదవ్, తెలుగు యువత నాయకుడు కట్టా దొరస్వామి నాయుడు ఇన్ఛార్జ్ పదవి కోసం ప్రయత్నాలు చేస్తుండగా, క్యాడర్ మాత్రం ద్విసభ్య కమిటీ ఏర్పాటు చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు వెళ్లాలని కోరుకుంటోందట. త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్:. తిరుపతి నియోజకవర్గంలో కూడా ఇదే విధమైన నాయకత్వ శూన్యత నెలకొని ఉందట. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఇన్ఛార్జ్గా ఉన్నప్పటికీ, ఆమెకు సహకరించే నాయకత్వం లేకపోవడంతో ఆమె ప్రయత్నాలు ఫలించడం లేదు. చాలామంది నాయకులు ఇన్ఛార్జ్ పదవి కోసం ప్రయత్నించి, ఆశలు వదులుకుని సైలెంట్ అయ్యారు. ఇక్కడ జనసేన ఎమ్మెల్యే ఉండటం, అధిక సంఖ్యలో వైసీపీ నుంచి వచ్చిన కార్పొరేటర్లు జనసేన వైపు మొగ్గు చూపడం పార్టీని బలహీనపరుస్తోంది. దీనికి తోడు, నగర పాలక సంస్థలో అవినీతి, దందాలు పెరిగిపోవడంతో సామాన్య ప్రజలు అల్లాడుతున్నారు, ఫలితంగా టీడీపీ క్యాడర్ తీవ్రమైన మానసిక క్షోభకు లోనవుతోందట. ఈ పరిస్థితుల దృష్ట్యా, క్యాడర్ త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తోందట. జె.బి. శ్రీనివాస్, మబ్బు నారాయణ రెడ్డి, దంపూరి భాస్కర్ యాదవ్ లతో కూడిన కమిటీ ఏర్పాటు చేస్తే మూడు బలమైన సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం లభించి, పార్టీ బలోపేతం అవుతుందని వారి అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ ఇన్ఛార్జ్ల నియామకంలో కూడా బలహీనులను పెట్టారనే విమర్శలున్నాయి. సత్యవేడులో కన్వీనర్గా శ్రీపతి బాబు తొలగింపు:. సత్యవేడులో పరిస్థితి మరింత విచిత్రంగా ఉంది. ఎన్నికల ముందు వైసీపీ నుంచి వచ్చి, అందరి వ్యతిరేకత మధ్య విజయం సాధించిన సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలం తర్వాత జరిగిన పరిణామాలతో ఇరుక్కుపోయారు. ముఖ్యంగా గ్రావెల్ మాఫియా చేసిన కుట్ర, ఓ మహిళా టీడీపీ నాయకురాలితో ఆయన వీడియో బయటకి రావడం వంటి వాటితో పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. ఆ తర్వాత శ్రీపతి బాబును కన్వీనర్గా నియమించినప్పటికీ, అధిష్టానం ఆయన్ను తొలగించి కాంట్రాక్టర్ శంకర్ రెడ్డిని ప్రోగ్రామ్ కన్వీనర్గా నియమించింది.. ఆయనే ఇన్ఛార్జ్గా చెప్పుకుంటున్నారు. శంకర్ రెడ్డి పార్టీలో చేరిన వెంటనే తన సామాజిక వర్గాన్ని మొత్తం పార్టీలోకి చేర్చి, వారికి అన్ని వ్యవహారాలు అప్పగించడంతో స్థానిక టీడీపీ క్యాడర్ తీవ్ర స్థాయిలో అగ్రహం వ్యక్తం చేస్తోంది. తాజాగా, ఓ దేవాలయం ధర్మకర్తల నియామకంలో వివాదస్పద మాజీ టీటీడీ బోర్డు మెంబర్ శేఖర్ రెడ్డి అనుచరుడికి అవకాశం కల్పించడం, అనేక కేసులు ఉన్న వ్యక్తిని చైర్మన్గా నియమించడం మరింత వివాదాన్ని రేపింది. ఇక్కడ కూడా తంబళ్లపల్లి మాదిరిగానే భవిష్యత్తులో పార్టీకి నష్టం చేకూర్చవచ్చని క్యాడర్ ఆందోళన చెందుతోంది. కోల్డ్ స్టోరేజ్లో పార్లమెంటరీ అధ్యక్షుల నియామకం:. ప్రతిష్టాత్మకమైన పుంగనూరు నియోజకవర్గంలోనూ ఇదే సమస్య తలెత్తింది. ఇన్ఛార్జ్ అయిన చల్లా బాబు రెడ్డి చుట్టూ ఉన్న కోటరీతో స్థానిక కార్యకర్తలు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో పార్టీ కోసం నష్టపోయిన, జైళ్లకు వెళ్లిన కార్యకర్తలను ఏమాత్రం పట్టించుకోకుండా, ఆయన కోటరీ తమను ఇబ్బంది పెడుతోందని, ముఖ్యంగా వైసీపీలో తమపై దాడులు చేసిన వారికి అండగా నిలుస్తోందని ఆరోపణలు వచ్చాయి. గతంలో రామకృష్ణ అనే టీడీపీ కార్యకర్త హత్యను కూడా దీనికి నిదర్శనంగా చూపుతున్నారు. అధికారం చేతికి వచ్చినా, కార్యకర్తలు తమ అధికార దర్పం చూపించుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని తెలుస్తోంది. పార్లమెంటరీ అధ్యక్షుల నియామకం కూడా కోల్డ్ స్టోరేజ్లో ఉండిపోయింది. మొత్తం మీద, ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి మంత్రి ప్రాతినిధ్యం లేకపోవడం, సీనియర్ నాయకులు పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టకపోవడం వంటి పరిస్థితుల్లో, కొత్త ఇన్ఛార్జ్లు, అధ్యక్షుల నియామకం తర్వాత అయినా తమను పట్టించుకునే వారు ఉంటారని కార్యకర్తలు ఆశగా ఎదురుచూస్తున్నారు

# సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండండి

### స్కాలర్షిప్‌లు, తుఫాను పరిహారం పేరుతో మోసాలు- జిల్లా ఎస్పీ ధీరజ్ హెచ్చరిక

**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** అన్నమయ్య జిల్లా పరిధిలో సైబర్ నేరాల ఉచ్చులో అమాయక ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు, రైతులు చిక్కుకోకుండా ఉండేందుకు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి జిల్లా ప్రజలను అప్రమత్తం చేశారు. ఇటీవల సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో మోసాలకు పాల్పడుతున్న విషయం పోలీసుల దృష్టికి వచ్చిందని, ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ మోసపోవద్దని ఆయన గట్టిగా హెచ్చరించారు.

**ముఖ్యంగా గమనించవలసిన మోసపూరిత పద్ధతులు**

విద్యార్థులకు వల 'మీకు స్కాలర్షిప్ మంజూరైంది' అంటూ సైబర్ నేరగాళ్లు విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని కాల్స్ లేదా మెసేజ్‌లు చేస్తున్నారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ ఖాతా వివరాలు లేదా OTP (వన్ టైమ్ పాస్‌వర్డ్) చెప్పమని అడిగి మోసాలకు పాల్పడుతున్నారు.

**రైతులకు నకిలీ పరిహారం**

ఇటీవల తుఫాను లేదా ఇతర ప్రకృతి వైపరీత్యాలకు నష్టం పరిహారం ఇస్తామంటూ రైతుల మొబైల్ ఫోన్‌లకు ఫ్రాడ్ కాల్స్ చేస్తున్నారు. పరిహారం పేరుతో మోసగాళ్లు సున్నితమైన సమాచారాన్ని సేకరించి డబ్బు కాజేస్తున్నారు.

**పాస్‌బుక్ వివరాల మాయాజాలం**

'మీ పాస్‌బుక్‌లలో లేదా బ్యాంక్ ఖాతా వివరాలలో ఆన్‌లైన్‌లో పొరపాట్లు ఉన్నాయి, వాటిని సరిదిద్దాలి' అంటూ సైబర్ నేరగాళ్లు రైతులను టార్గెట్ చేస్తున్నారు.

**లింక్‌లు, OTP అడిగితే జాగ్రత్త!**

ఈ నేరగాళ్లు తప్పులను సరిదిద్దే నెపంతో తెలియని లింక్‌లను క్లిక్ చేయమని లేదా వారి OTP (వన్ టైమ్ పాస్‌వర్డ్), బ్యాంక్ వివరాలను చెప్పమని అడుగుతున్నారు. ఇలాంటి వాటిని ఎట్టిపరిస్థితిలోనూ వెల్లడించకూడదు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ధీరజ్ మాట్లాడుతూ.. జిల్లా ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు మరియు రైతులు తెలియని నంబర్ల నుండి వచ్చే కాల్స్‌కు, మెసేజ్‌లకు స్పందించవద్దని ఎస్పీ కోరారు. "ప్రభుత్వం, బ్యాంకుల తరఫున



కానీ ఎవరూ ఎప్పుడూ ఫోన్ చేసి మీ వ్యక్తిగత వివరాలు, ఆధార్ నంబర్, బ్యాంక్ ఖాతా వివరాలు, పిన్ నంబర్ లేదా ఓటీపీని అడగరు. ఇటువంటి కాల్స్/మెసేజ్‌లు వచ్చినప్పుడు వెంటనే అప్రమత్తమై, వాటిని విస్మరించాలి. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైనట్లయితే, తక్షణమే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు లేదా దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగలరు." మోసపోవద్దు! అప్రమత్తంగా ఉండండి! సురక్షితంగా ఉండాలని ఎస్పీ పేర్కొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయండి

- శాసనసభ కమిటీకి ఎంఈఎఫ్ జనరల్ సెక్రెటరీ నారాయణప్ప వినతి



**తనకల్లు, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** ఎస్సీ, ఎస్టీ బ్లాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని ఎస్సీ, ఎస్టీ శాసనసభ కమిటీకి ఎంఈఎఫ్ జనరల్ సెక్రెటరీ గొల్ల నారాయణప్ప విన్నవించారు. ఎస్కేయూలో 1993 నుండి వివిధ విభాగాల్లో 900 మంది టైం స్కేల్ ఉద్యోగులు వివిధ విభాగాల్లో పని చేస్తున్నారన్నారు. అనేక కమిటీలు వచ్చినా బ్లాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయలేదన్నారు. 2017లో నోటిఫికేషన్ ఇచ్చినా ఇంతవరకు స్పందన లేదన్నారు. ఎస్కేయూలో కొంతమంది కోర్టులో స్టే ఇప్పించారని, మీరు దయవుంచి సమస్యను పరిష్కరించి, 72 బ్లాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని నారాయణప్ప కోరారు.

## వృద్ధులు, దివ్యాంగులకు చలికోట్లు పంపిణీ



**కుప్పం, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** కుప్పం సమాచారం సొసైటీ సభ్యుడు అర్వాన్ జన్మదిన సందర్భంగా కుప్పం పట్టణంలో రోడ్డు పక్కన ఉంటున్న వృద్ధులకు, దివ్యాంగులకు బుధవారం చలికోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ కుప్పం పట్టణంలో చలి తీవ్రత అధికంగా ఉందని ఈ సందర్భంగా వృద్ధులకు, దివ్యాంగులకు చలికోట్లు పంపిణీ చేశామన్నారు. రానున్న రోజుల్లో మరి కొంతమందికి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సమాజ సేవలో ప్రధానమైనది మానవ సేవని తోటి మనిషికి సేవ చేయడంలో ఆనందం ఎనలేనిదన్నారు. పేదలకు సేవ చేయడం, సహకరించడంలో కలిగే సంతృప్తి కంటే గొప్పది ఏదీ లేదన్నారు. ఆ సేవలో భాగంగానే ప్రతి ఏటా శీతాకాలంలో వృద్ధులకు దుప్పట్లు, చలి దుస్తులను పంపిణీ చేస్తున్నామని అన్నారు. కుప్పం సమాచారం సొసైటీ సభ్యుల అధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేస్తూ సమాజానికి తమకు తోచిన సహాయం చేస్తామని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజు వేలు, చంద్ర, మతీన్, గని, సురేష్, లాలు, ఖలీమ్, ఇస్మాయిల్, ప్రవీణ్, సోము, అజీమ్, యారబ్, గురుస్వామి, ప్రవీణ్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసాయి విద్యాసంస్థల అధినేతకు 'భారత్ ఎక్సలెన్స్ అవార్డు'




**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** విద్యా ప్రదాతగా, ఆలయాల జీర్ణోదారకుడిగా విశేష సేవలందిస్తున్న శ్రీ సాయి విద్యాసంస్థల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ కే.పి.వి. సుబ్బయ్య ప్రతిష్టాత్మక భారత్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో మాట్లాడుతూ, గత 25 సంవత్సరాలుగా శ్రీ సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పాఠశాల, జూనియర్ కాలేజ్ మరియు ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించి, వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును వెలుగులు నింపిన సుబ్బయ్య గారి సేవలను గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేయడం గర్వకారణమని తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు దేశ విదేశాలలో ప్రభుత్వ, ప్రైవేట్, సాఫ్ట్‌వేర్ మరియు వ్యాపార రంగాల్లో రాణిస్తూ ఉన్నత స్థానాలు సంపాదించడం ఆయన దూరదృష్టి ఫలితమని పేర్కొన్నారు. సాంకేతిక విద్యా రంగంలో ఆయన చేసిన విశిష్ట కృషిని గుర్తిస్తూ, ఈ అవార్డును ఏఐసీటీఈ చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్, జేఎన్టీయూ కాకినాడ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ చేకూరి శివరామకృష్ణ ప్రసాద్, మరియు బ్రెయిన్ ఓ విజన్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో డి. గణేష్ సంయుక్తంగా ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. వెంకట రమణ, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు శ్రీ కే.పి.వి. సుబ్బయ్య కి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

### జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



**అనంతపురం, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** జిల్లాలో వివిధ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశంలో జెడ్పి చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం గిరిజమ్మ ఆధ్వర్యంలో స్థాయి సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయం గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖలపై జరిగిన సమీక్షలలో ఆయా శాఖల పురోగతి, ప్రభుత్వ పథకాలపై ఆయా శాఖల అధికారులు సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా జెడ్పి చైర్మన్ బోయ గిరిజమ్మ తో పాటు ఇతర సభ్యులు మాట్లాడుతూ రైతుల సమస్యలు, హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలుపరిష్కరించాలని, అకాల వర్షాల కారణంగా తమ పంటలను నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకునే విధంగా ఆయా పంటల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పంటలపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సంబంధిత శాఖ అధికారులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారిక కార్యక్రమంలో ప్రోటోకాల్ పాటించాలని అధికారులకుసూచించారు. అదే విధంగా పలు సమస్యలపై చర్చించినారు. తొలుత మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ రెడ్డప్పరెడ్డి మృతికి సంతాప సూచకంగా సభలో రెండు నిమిషాల పాటు మౌనం వహిస్తూ నివాళులు అర్పించారు. వ్యవసాయ శాఖ పై సమీక్షించారు. ఈ సందర్భంగా గౌరవ జిల్లా పరిషత్ అధ్యక్షులు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు వెళ్లి ఈ అకాల వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయిన ఆయా మండలాలకు సంబంధించిన రైతులకు జరిగిన నష్టాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదించాలన్నారు. అలాగే ఆత్మకూరు మండలం లో సదరు పంట నష్టాన్ని అంచనా వేయమని కోరిన వ్యవసాయ అధికారులు పై తగిన చర్యలు తీసుకోవాలని ప్రశ్నించారు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ అధ్యక్షులు తెలిపిన విషయంపై ఇంతకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బుక్కరాయసముద్రం జడ్పిటిసి మాట్లాడుతూ పుట్లూరు ,ఎల్లనూరు ప్రాంతాలలో పప్పుశనగ విత్తనాలు అందక రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని దీనిపైన తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారి స్పందిస్తూ ఫసల్ బీమా యోజన కింద రైతులకు వరి పంట నష్టానికి ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేస్తున్నామని పప్పు సన్నగా విత్తన పంపిణీ త్వరలోనేమొదలుపెడతామని జడ్పిటిసి సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానం తెలిపారు. గుమ్మగట్ట జడ్పిటిసి మాట్లాడుతూ అక్టోబర్ ఒకటో నుండి 15 తేదీ లోపల విత్తన పంపిణీ జరగాల్సి ఉండగా నవంబర్ ఒకటో తేదీ దగ్గరకు వస్తున్న కూడా విత్తన పంపిణీ జరగలేదని అలాగే అకాల వర్షాలకు వేరుశనగ పంట దెబ్బతిన్నదని కందుల పంట కూడా పూత లేక ఇబ్బంది పడుతున్న రైతులకు ఇన్సూరెన్స్ అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఎరువుల కొడతా లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీ సత్య సాయి జిల్లా లో డిఆర్డిఏ శాఖ పురోగతిని వివరించవలసిందిగా జడ్పీ చైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో సుమారు రెండు 2,63,987 మంది లబ్ధిదారులు ప్రతి నెల రూ. 11 5. 54 కోర్టులో పెన్షన్ రూపంలో లబ్ధి పొందుతున్నారని అలాగే 20 25 - 26 ఆర్థిక సంవత్సరంలో 1- 4- 2025 నుండి 30- 9 - 20 25 వరకు 2,63 ,987 మంది పెన్షన్ దారులకు గాను రూ. 690. 92 కోట్ల రూపాయలను లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ డ్వాక్రా సంఘం నిధులు దుర్వినియోగం అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చాయని దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే కొత్త పెన్షన్ల మంజూరు, వికలాంగుల పెన్షన్ల మంజూరు తదితర విషయాలపై చర్చించారు. స్త్రీ మరియు శిశు సంక్షేమ కమిటీ ద్వారా సమీక్షిస్తూ అంగన్వాడీ కేంద్రాలకు పౌష్టిక ఆహారం సక్రమంగా అందలేదన్న ఫిర్యాదులు వస్తున్నాయని జిల్లా ప్రజా పరిషత్ నుండి అంగన్వాడీ కేంద్రాల మరమ్మత్తులకు గ్రాంట్ నిధులు మంజూరు చేస్తున్న నేపథ్యంలో పనుల వివరాలు తెలియజేయాలని అడిగారు. అలాగే విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లో డ్రాప్‌ఓట్స్ కాకుండా సంక్షేమ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్మన్ సూచించారు. జిల్లా పరిషత్ అధ్యక్షులు అడిగిన విషయాలపై సంబంధిత శాఖ అధికారులు తగిన విధంగా వివరణ ఇచ్చారు. ఈ సమావేశంలో జెడ్పి సిఈఓ శివశంకర్, డిప్యూటీ సిఈఓ వెంకట సుబ్బయ్య,పలువురు స్టాండింగ్ కమిటీ సభ్యులు గుమ్మగట్ట జడ్పిటిసి మహేష్, డి హీరేహాళ్ జెడ్పిటిసి హసీనా బాను, బుక్కరాయసముద్రం జడ్పిటిసి భాస్కర్ అనంతపురం రూరల్ జెడ్పిటిసి చంద్ర , నల్లమడ జడ్పిటిసి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆలూరు టీడీపీ కమిటీలు త్వరగా పూర్తిచేయండి

### నియోజకవర్గ అబ్జర్వర్, రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సుబ్బారెడ్డి



**ఆలూరు, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** ఆలూరులో వాసవి కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్ నందు బుధవారం ఆలూరు నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్ వైకుంఠం జ్యోతి నిర్వహించిన ఆలూరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన. ఆలూరు నియోజకవర్గ అబ్జర్వర్, రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి ఈ సందర్భంగా సీడ్స్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి మాట్లాడుతూ. అధిష్టానం ఆదేశాల మేరకు ఆలూరు నియోజకవర్గంకు అబ్జర్వర్ గా రావడం జరిగిందని రాష్ట్రంలో చాలా వరకు అన్ని నియోజకవర్గాల్లో కమిటీ లు దాదాపు పూర్తి అయ్యాయని, ఆలూరు నియోజకవర్గంలో కమిటీలు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు, ఆలూరు నియోజకవర్గం సంబంధించిన కమిటీలు క్లస్టర్ , బూత్ కన్వీనర్లు,కో-కన్వీనర్లు , యూనిట్ ఇంచార్జ్ లు , క్లస్టర్ ఇంఛార్జ్ లు, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి కమిటీ లు అన్ని పూర్తి చేయాలని తెలిపారు. అదేవిధంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీని గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైకుంఠం శివ ప్రసాద్ రామచంద్ర నాయుడు మరియు అన్ని మండలాల కన్వీనర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రభుత్వమే జవాబుదారీగా మద్యం అమ్మకాలు జరపాలి

- అనంతపురం వైసీపీ గ్రీవెన్సు సెల్ జిల్లా అధ్యక్షులు బాకే హాబీబుల్లా



**అనంతపురం క్రైమ్, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** ప్రైవేట్ మద్యం వ్యాపారస్తులు వారి ఆదాయం కోసం నియంత్రణ, జవాబుదారీతనం, వేళాపాళా లేని మద్యం అమ్మకాల వల్ల రాష్ట్రంలో మద్యం తాగడం అలవాటు లేని యువకులు సైతం మద్యాన్ని సేవించడం అలవాటు చేసుకొంటున్నారనీ దీనిమూలంగా వారు మద్యం మత్తులో వారు చేస్తున్న పనులపై వారికీ నియంత్రణ లేక ప్రమాదాలలో తమ ప్రాణాలు పోగొట్టుకోవటం కాక ఇతరుల ప్రాణాలు సైతం పోవుటకు కారకులు అవుతున్నారనీ అనంతపురం వైసీపీ గ్రీవెన్సు సెల్ జిల్లా అధ్యక్షులు...బాకే హాబీబుల్లా తెలిపారు. మొన్న కర్నూలు వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదం సంఘటన వల్ల దేశ వ్యాప్తంగా మన రాష్ట్రా మద్యం విచ్చలవిడి అమ్మకాల పై చర్చలు జరుగుతున్నాయి, దీనికి తోడుగా సంచలనం సృష్టించన నకిలీ మద్యం తయారీకి మద్యం మాఫియా ఏకంగా రాష్ట్రం లో మద్యం తయారీ కూటిర పరిశ్రమ ఏర్పాటు పట్టుపడడం చూసి రాష్ట్ర ప్రజలు మద్యం మాఫియా ఆగడాలపై భయాందోళనకు గురి అవుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రములో ప్రవేటు మద్యం వ్యాపారస్తులు వారి ఆదాయం కోసం ఎక్కడ పడితే అక్కడ బెల్టు షాపులు, పర్మిట్ రూముల ద్వారా విచ్చలవిడిగా నియంత్రణ, జవాబుదారి తనం లేని అమ్మకాల వల్ల అనేక ఘోర సంఘటనలు జరుగుతున్నాయి వీటిపై కూటమి ప్రభుత్వం తీసుకొంటున్న చర్యల వల్ల ఎలాంటి ఫలితాలు కనబడటం లేదు, కావున భవిష్యత్తు లో ఈ మద్యం అమ్మకాలను ప్రవేటు వ్యక్తుల కు ఇచ్చే టెండర్ ల విధానం రద్దు చేసి మద్యం అమ్మకాలను గతం లో జగన్ ప్రభుత్వంలో మద్యం అమ్మకాల నీయంత్రణ కు తీసుకొన్న "కఠిన మద్యం అమ్మకాల పాలసీ" ని కూటమి ప్రభుత్వం కూడా జగన్ లాగా ఆ పాలసీ కొనసాగించాలని ప్రభుత్వమే చిత్తశుద్ధి తో మద్యం అమ్మకాలను కొనసాగించి, ప్రజల మాన ప్రాణాలు కాపాడాలని బాకే హాబీబుల్లా డిమాండు చేశారు.

## రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి: నాయుడుపేట పట్టణ సీఐ బాబి



**నాయుడుపేట, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా గురువారం నాయుడుపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని నాయుడుపేట పట్టణ సిఐ బాబి ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదాన శిబిరంలో ప్రతి ఒక్కరూ పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. దాతలు ఇచ్చే రక్తంతో మరొక ప్రాణం నిలబడుతుందన్నారు. స్వచ్ఛందంగా రక్తదాన శిబిరంలో పాల్గొనాలని సీఐ బాబి కోరారు.

# నెలరోజుల్లో 3.4 మీటర్ల భూగర్భ జలాలు పెరుగుదల

## కృషిచేసిన అధికారులు, సిబ్బందికి అభినందనలు

## వాట్సాప్‌లో ప్రభుత్వ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలి - జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్





**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** గత నెల రోజుల కాలంలో 3.4 మీటర్ల భూగర్భ జలాలు పెరుగుదలలో కృషిచేసిన అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపి మై స్కూల్ మై ఫ్రైడ్ కార్యక్రమంలో 9, 10 తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాట్సాప్ ద్వారా ప్రభుత్వం అందించే సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్.... సబ్ కలెక్టర్లు ఆర్డిఓ తాసిల్దార్లు మునిసిపల్ కమిషనర్లు ఎంపీడీవోలు నీటిపారుదల శాఖ హౌసింగ్ శాఖ తదితర శాఖల అధికారులు మరియు సిబ్బందితో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకం పి జి ఆర్ ఎస్ ద్వారా అందిన సమస్యల పరిష్కారం వాట్సాప్ గవర్నెన్స్ ప్రజల నుండి వివిధ అంశాలపై తీసుకున్న ప్రజాభిప్రాయ సేకరణ వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు కు అవసరమయ్యే భూసేకరణ రీ సర్వే చిన్న తరహా నీటిపారుదల స్వచ్ఛ ఆంధ్ర తదితర అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకం కింద ఎక్కువమంది పని చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలను ఆదేశించారు. వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలపై ప్రజల్లో ఎక్కువగా అవగాహన కల్పించి వాట్సాప్ ద్వారా సేవలను వినియోగించుకునేలా చేయాలన్నారు. వాటర్ గ్రిడ్ కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా శాఖకు అవసరమయ్యే భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. చిన్న తరహా నీటిపారుదల శాఖపై సమీక్షిస్తూ గత నెల రోజుల కాలంలో అన్నమయ్య జిల్లాలో దాదాపు 3.4 మీటర్ల భూగర్భ జలాలు పెరిగాయని దీనికి కృషి చేసిన నీటిపారుదల శాఖ అధికారులు మరియు సిబ్బందికి అభినందనలు తెలిపారు. రాబోయే ఎండాకాలంలో భూగర్భ జలాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. రీ సర్వేపై సమీక్షిస్తూ మొదటి ఫేస్ లో చేసిన తప్పులు రెండవ ఫేస్‌లో చేయకుండా చూడాలని ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. హౌసింగ్ శాఖపై సమీక్షిస్తూ స్టేజ్ కన్వర్షన్‌లో పురోగతి సాధించాలని ఆదేశించారు. ఆవాజ్ ప్లస్ సర్వే కార్యక్రమాన్ని 5 నవంబర్ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం పై సమీక్ష ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ కార్యక్రమాన్ని 100% జరిగేలా చూడాలన్నారు. చెత్త సేకరణపై ప్రజాభిప్రాయాలను దృష్టిలో పెట్టుకొని సంబంధిత గ్రామ పంచాయతీలు చర్యలు చేపట్టాలన్నారు. మునిసిపల్ పరిపాలన పై సమీక్షిస్తూ మునిసిపాలిటీలలో నీటి సరఫరా జరిగే పైప్ లైన్లు డ్రైనేజీ పైప్లైన్లు కలవకుండా చూడాలని మంచినీరు కలుషితం కాకూడదని దీనికి చేపట్టాల్సిన చర్యలను వెంటనే చేపట్టాలన్నారు. అన్న క్యాంటీన్లు పరిశుభ్రంగా ఉండాలని, భోజనం సమయానికి ప్రజలకు అందేలా చూడాలన్నారు. మై స్కూల్ మై ఫ్రైడ్ కార్యక్రమం పై సమీక్షిస్తూ విద్యార్థినీ విద్యార్థుల జీవితంలో పదవ తరగతి ఎంతో కీలకమని ఆ దశలో సరైన మార్గాన్ని చూపించగలిగితే సమాజంలో అభివృద్ధిని చూడవచ్చని పేర్కొన్నారు వారంలో రెండు రోజులపాటు జిల్లాలోని ప్రతి పాఠశాలలో 9 మరియు 10వ తరగతి విద్యార్థులపై దృష్టి సారించి మ్యాథమెటిక్స్ సైన్స్ మరియు ఇంగ్లీష్ సబ్జెక్టులలో విద్యార్థిని విద్యార్థుల అభ్యసనాన్ని సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. తాను పార్వతీపురం మన్యం జిల్లాలో పనిచేసేటప్పుడు రెండు సంవత్సరాలు వరుసగా రాష్ట్రస్థాయి పేపర్లు జిల్లా నుంచి ఎంపికయ్యారని అత్యుత్తమ పాస్ పర్సంటేజ్ ను మన్యం జిల్లాలో ఈ కార్యక్రమం ద్వారా సాధించగలిగామని తెలిపారు. మన జిల్లాలో తుఫాను తీవ్రత ఎక్కువగా లేనప్పటికీ అధికారులు మరియు సిబ్బంది అన్ని రకాల చర్యలు తీసుకున్నారని భవిష్యత్తులో ఇటువంటి తుఫాను వచ్చే సందర్భంలో తీసుకోవాల్సిన చర్యలపై ఎస్ఓపిని తయారు చేసుకుని సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కనకనాచమ్మ అలయానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం

- భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరిన ఎమ్మెల్సీ కంచర్ల



**కుప్పం, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** ఆంధ్రా, తమిళనాడు సరిహద్దులోని కుప్పం మండల పరిధిలోని కనక నాచమ్మ ఆలయానికి ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. భక్తులను దృష్టిలో పెట్టుకుని ఆ గుడికి ఆర్టీసీ అధికారులు బస్సును ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ను, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నంలను స్థానికులు కోరారు.దీంతో భక్తుల కోరిక మేరకు ఈ బస్సు సర్వీసును బుధవారం ప్రారంభించినట్లు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నంలు మీడియాకు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలోని దేవాలయాలకు సైతం ఆర్టీసీ ద్వారా నేరుగా రవాణా సౌకర్యం అందించే దిశలో ప్రభుత్వం కట్టుదిట్టంగా ముందుకు సాగుతోందని వారు చెప్పారు. భక్తుల డిమాండ్‌పై అవసరానికి అనుగుణంగా అదనపు సర్వీసులు కూడా నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని తక్కువ ఖర్చుతో సురక్షితంగా ఆలయ దర్శనం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెస్కో అధ్యక్షుడు వి జి ప్రతాప్, ఏఎంసీ ఛైర్మన్ జిఎం రాజు, కుప్పం మున్సిపాలిటీ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కడ సలహా మండలి సభ్యులు రాజ్కుమార్, సుగుణమ్మ, రామచంద్ర, రెస్కో డైరెక్టర్ తులసి నాథ్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, సీనియర్ నేతలు పి గోపీనాథ్, తెలుగుదేశం పార్టీ నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యం, రమణ, ఉదయ్ కుమార్, రాజగోపాల్, ఆర్టీసీ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.






# వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన 30 కుటుంబాలు

## సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

**కుప్పం, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండల పరిధిలోని కంచి బంధార్లపల్లి పంచాయతీకి చెందిన వైయస్సార్ పార్టీ కార్యకర్తలు బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. సుమారు 30 కుటుంబాలకు చెందిన వైసిపి కార్యకర్తలు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ సమక్షంలో టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ వారికి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించి గుడుపల్లి మండల పరిధిలోని కంచి బంధార్లపల్లి గ్రామంలోని 30 కుటుంబాలకు చెందిన వైసిపి కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం దేశ విదేశాలలో పర్యటించి మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే విధంగా కృషి చేస్తుంటే ప్రతిపక్ష నేతలు ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తున్నారని దునుమడారు. రానున్న కాలంలో కుప్పం నియోజకవర్గం పరిశ్రమలు, ఉద్యోగాలతో అభివృద్ధి పథంలో దూసుకుపోనుందని తెలిపారు. ఇప్పటికే ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కుప్పంలో 2000 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీలో చేరిన కంచిబంధార్ల పల్లి గ్రామస్తులను కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పి ఎస్ మునిరత్నం, ఏఎంసి అధ్యక్షుడు జిఎం రాజు, గుడిపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యం, మాజీ అధ్యక్షుడు టి ఎం బాబు నాయుడు, తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులపై అవగాహన




**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** గోరంట్ల మండలంలోని జిల్లా పరిషత్ బూదిలి హైస్కూల్‌లో 9,10 తరగతి తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు అందులో భాగంగా వోకేషనల్‌లో పీఎఫ్ ఎస్ ఐ సబ్జెక్టులో ప్రాముఖ్యత కోసం గోరంట్ల స్టేట్ బ్యాంక్ శాఖ నందు ఇండస్ట్రియల్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకులో నిప్పులు ఎలా పూజించాలి నగదు బదిలీ,విత్ డ్రా చేసుకొని విధానంపై బ్యాంక్ సిబ్బంది అవగాహన కల్పించారు, ఒకేషనల్ ట్రైనర్స్ యమునా బాయి, ప్రమీల, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కడప ఏఎస్పీ ప్రకాష్ బాబుకు ఘన సన్మానం



**రాయచోటి, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** గతంలో రాయచోటి అర్బన్ సిఐ గా పనిచేసి వివిధ హోదాలలో ఇతర ప్రాంతాలలో పనిచేస్తూ పదోన్నతిపై కడప జిల్లా అదనపు ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న ప్రకాష్ బాబును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో రాయచోటి పట్టణంలోని పిసిఆర్ గ్రాండ్ లో జరిగిన ఆత్మీయ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ఏఎస్పి ప్రకాష్ బాబు ఎక్కడ పని చేసిన లా అండ్ ఆర్డర్ విషయంలో కానీ,సామాన్య ప్రజల సమస్యల పరిష్కారంలో కానీ,ట్రాఫిక్ సమస్య నియంత్రణలో కానీ ముక్కుసూటిగా వ్యవహరించే తత్వం గల వ్యక్తి అని కొనియాడారు.ప్రజలతో అవినాభావ సంబంధాలు కొనసాగిస్తూ పేద ప్రజలకు అండగా నిలుస్తూ పోలీసు వృత్తికే వన్నె తెచ్చిన వ్యక్తి ప్రకాష్ బాబు అని అన్నారు. రాయచోటిలో అర్బన్ సీఐగా పని చేసిన కాలంలో పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేశారన్నారు.ఈ కార్యక్రమంలో బంగారు దుకాణాల అసోసియేషన్ కార్యదర్శి ఇర్షాద్ అలీఖాన్.లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వ్యవస్థాపకులు పిఎస్ హరినాథ్ రెడ్డి,లయన్ నాగేశ్వరరావు, బంగారు దుకాణాల యజమానులు సయ్యద్, జానకిరామ్, విజయ్ రెడ్డిమేడ్ షాఫ్ యజమాని కూనా విజయ్,దిగువ అబ్బవరం మాజీ వైస్ సర్పంచ్ తిరుపాల్ నాయుడు,మాజీ కౌన్సిలర్ చెంగా ఈశ్వరయ్య,ఎస్ కే హెచ్ గోల్డ్ షాప్ యజమాని అల్లా బకష్, కలీముల్లా,మాజీ ఎంపీపీ ఖాదర్ భాషా,ఆర్యవైశ్య సంఘం నేతలు పబ్బిశెట్టి సురేష్ కుమార్,కుప్పం రెడ్డి శంకర్,సతీష్ కుమార్, ప్రముఖ వైద్యులు మహేశ్వరరాజు, రాయచోటి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ లక్ష్మీప్రసాద్,రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు సయ్యద్ రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## సీహెచ్‌సీలో హెచ్‌డీఎస్ సమావేశం




**తనకల్లు, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో సూపరింటెండెంట్ విజయ్ ఆధ్వర్యంలో హెచ్‌డీఎస్ సమావేశం నిర్వహించినారు. హాస్పిటల్ డెవలప్మెంట్ డైరెక్టర్ సోంపాలెం నాగభూషణం, శ్రీనివాసులు, సురేష్, గోపి, వైద్య సిబ్బంది పాల్గొని పలు సమస్యల పైన చర్చించారు ఈ సందర్భంగా సోంపాలెం నాగభూషణం మాట్లాడుతూ తనకల్లు మండలంలో మన హాస్పిటల్కు అనేకమంది రోగులు వస్తున్నారు గత ప్రభుత్వం చేసిన తప్పులు దృష్టిలో పెట్టుకొని ప్రజలకు కావలసిన వసతులు అన్ని కూడా అందుబాటులో ఉండే విధంగా ప్రత్యేకంగా ప్రతి బుధవారము మహిళలకు ఆపరేషన్లు రక్త పరీక్ష బీపీ డెంటల్ ప్రతి ఒక్కదానిపైన క్షుణ్ణంగా పరిశీలించి వైద్యం చేస్తున్న మా వైద్య సిబ్బందికి అందరికి కూడా ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలుపుతున్నాము దగ్గర్లో కొత్త బిల్డింగు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మార్చురి అన్ని కూడా దగ్గర్లో అందుబాటులోకి వస్తాయి ఇది మంచి ప్రభుత్వం ఇంకా ఏవైనా ఉన్నా కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి హాస్పెటల్ని అభివృద్ధి పరిచే విధంగా తెలియజేస్తాం ఇది మన కుటుంబం మనందరి కుటుంబం వచ్చే పేషెంట్ మన బంధువు లాంటివాళ్ళు వాళ్లను బాగా పలకరించి వారికి మంచి వైద్యం అందించాలని కూడా వారు కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్ భాస్కర్ నాయక్ రమేష్ నాయక్ డాక్టర్ సాదియా, డాక్టర్ సులోచన సిస్టర్స్ ల్యాబ్ టెక్నికల్ ఫార్మసిస్ట్ ఆరోగ్యశ్రీ సిబ్బంది శానిటైజర్స్ హెూంగార్డ్ హరి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అమర వీరుల స్మారకార్థం కొవ్వొత్తుల ర్యాలీ



**గుత్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** గుత్తి పట్టణంలో పోలీసు అమర వీరుల వారోత్సవాల సందర్భంగా బుధవారం మహర్షి దయానంద గురుకులం విద్యార్థులు, పోలీసులు సంయుక్తంగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ పట్టణంలోని ప్రధానవీధుల గుండాసాగింది. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమర వీరులను స్మరించుకుంటూ విద్యార్థులు,పోలీసులు కలసి మౌ నం పాటించారు. ఈ సందర్భంగా ప్రజలు వీధుల వెంట నిలబడి పో లీసు సేవల పట్ల సంఘీభావం వ్యక్తం చేశారు. పోలీసు అమర వీరులు తమ కుటుంబాలను, ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల భద్రత కోసం పనిచేస్తారనే భావన ప్రజల్లో కనిపించడం గమనార్హం అని పాల్గొన్న అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గుత్తి సబ్ ఇన్స్పెక్టర్ సురేష్, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ రామాంజినేయులు, హెడ్ కానిస్టేబుల్ హనుమంతు, కానిస్టేబుల్ శ్రీనివాసులరెడ్డి, ద్వారకానాథ్, హెూంగార్డులు, శ్రీరామ్, మురళి, పీరా, మహర్షి దయానంద గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక



**నాయుడుపేట, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** నాయుడుపేటకు చెందిన మాస్టర్స్ తైక్వాండో క్లబ్ క్రీడాకారులు బి.దీపిక, ఎస్.బెనేల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని గ్రేటర్ నెల్లూరు డిస్ట్రిక్ట్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. అఖిల్ తెలియజేశారు. గ్రేటర్ నెల్లూరు డిస్ట్రిక్ట్ తైక్వాండో అసోసియేషన్ తరఫున ప్రాతినిధ్యం వహించిన ఈ క్రీడాకారులు, ఇటీవల అనంతపురం జిల్లాలో జరిగిన 42వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ జూనియర్ క్యోరుగీ మరియు 15వ స్టేట్ జూనియర్ పూమ్సే తైక్వాండో ఛాంపియన్‌షిప్ -2025లో అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఈ పోటీల్లో జూనియర్ గర్ల్స్ (అండర్ 68 కేజీ) విభాగంలో క్రీడాకారిణి బి. దీపిక క్యోరుగీ, గ్రూప్ పూమ్సేలో రెండు గోల్డ్‌మెడల్స్, ఇండివిడ్యువల్ పూమ్సేలో సిల్వర్ మెడల్ సాధించగా, జూనియర్ బాయ్స్ (అండర్ 68 కేజీ) విభాగంలో క్రీడాకారుడు ఎస్.బెనేల్ ఇండివిడ్యువల్ పూమ్సేలో గోల్డ్ మెడల్, క్యోరుగీలో సిల్వర్ మెడల్ గెలుచుకున్నారు. ఈ విజయాల ద్వారా, ఈ క్రీడాకారులు 2025 అక్టోబర్ 31 నుండి నవంబర్ 2 వరకు బెంగళూరులోని కొరమంగళ్ ఇండోర్ స్టేడియంలో కర్ణాటక తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే 42వ నేషనల్ జూనియర్ క్యోరుగీ మరియు 15వ నేషనల్ జూనియర్ పూమ్సే తైక్వాండో ఛాంపియన్‌షిప్ -2025కి ఎంపికయ్యారు. మాస్టర్స్ తైక్వాండో క్లబ్ స్థాపకులు మాస్టర్ ఉయ్యాల పవన్ కుమార్ క్రీడాకారుల కృషిని ప్రశంసించగా, గ్రేటర్ నెల్లూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రెసిడెంట్ వి. మనీషా, కోచ్‌లు భగత్, చంద్రమోహన్ , ఏ. వినోద్ కుమార్, ఎస్కే అశ్రఫ్, ఉయ్యాల పవన్ కుమార్, విజయ్, ఆంజనేయులు, వెంకటేష్, బాలకృష్ణ, నవీన్ కుమార్, ఫణీంద్ర, సిహెచ్ శ్రీనివాసులు ,చరణ్ తేజ, సాగర్ ,ప్రభ, తదితరులు నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

## శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

- **పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్**



**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** నవంబర్ నెలలో శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని.. పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటు కొరకు అనువైన ప్రదేశాలు ఎంపిక చేయడానికి బుధవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. ఇందులో భాగంగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్, ఆనంద విల్లాస్ వద్ద, టీ జంక్షన్, శిల్పారామం, చిత్రావతి బ్రిడ్జి మార్కెట్, కర్ణాట నాగేపల్లి, బైపాస్ ఫోర్ వే తదితర ప్రదేశాలలో సుడిగాలి పర్యటన చేసి పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటుకు సాధ్యసాధ్యాలను పరిశీలించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పార్కింగ్ ప్రదేశాలను ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. పార్కింగ్ ప్రదేశాల లెవెలింగ్, అక్కడి నుంచి వెళ్లడానికి అనువైన విధంగా రహదారులు ఉండాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు, ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు సువర్ణ, వివిఎస్ శర్మ, మున్సిపల్ కమిషనర్ క్రాంతి, పిఆర్ ఎస్ఈ మురళి, డిఆర్డిఏ పిడి నరసయ్య, ఏపీఎస్ఆర్టిసి అధికారి ఇనాయతుల్లా, పబ్లిక్ హెల్త్ ఈఈ నరసింహ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్, డీఎంహెచ్ఓ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గోరంట్లలో 5న సత్య సాయి సేవాసదనం ప్రారంభం



**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** గోరంట్ల పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనం పక్కన నూతనంగా నిర్మించిన శ్రీ సత్య సాయి సేవాసదనం భవనాన్ని నవంబర్ 5వ తేదీన ప్రారంభిస్తున్నట్లు శ్రీ సత్య సాయి భజన మండలి జిల్లా కన్వీనర్ విజయలక్ష్మి వెంకట శివారెడ్డి దంపతులు తెలిపారు. బుధవారం పెన్షనర్స్ భవనం నందు సేవా సదనం ప్రారంభోత్సవ కరపత్రాలు విడుదల చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 5వ తేదీన అతి సుందరంగా నిర్మించిన భవనాన్ని సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు రత్నాకర్ చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందని, ఆ సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో భాగంగా ఒకరం సుప్రభాతం, పల్లకితో నగర సంకీర్తన జరగనున్నట్టు తెలిపారు, వేడుకల నేపథ్యంలో గుమ్మయగారి పల్లి క్రాస్ నుంచి ముఖ్య అతిథులకు ఆర్జే రత్నాకర్ కి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతూ భారీ ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పతాక ఆవిష్కరణ నూతన మందిర ప్రారంభోత్సవం జ్యోతి ప్రజ్వలన, బాలవికాస్ లో భాగంగా పిల్లలచే వేద పఠనం వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమాల్నిపదంలో పలు సేవా కార్యక్రమాల్లో భాగంగా దాదాపు 3,వేల మందికి అన్నదానం, 108 మంది కార్మికులకు వస్త్ర దానం, వందమందికి చీరల పంపిణీ వడ్డీ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి భజన బృందం సభ్యులు రత్నమయ్య శెట్టి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు రెడ్డి కేశవ ప్రసాద్, సునీత తదితరులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

### 10 తులాల బంగారు, వెండి 1250 గ్రాములు, 4 సెల్‌ఫోన్లు, కారు, మోటార్ సైకిల్ స్వాధీనం



**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో దొంగతనం చేసి ఇక్కడికి వచ్చి ఇక్కడే ఒక ఇంటిని అద్దెకి తీసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి రిమాండుకి పంపినట్టు శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి డిఎస్‌పి విజయ కుమార్ వెల్లడించారు. బుధవారం పుట్టపర్తి డిఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశంలో సిఐ మారుతి శంకర్‌తో కలసి డీఎస్పీ కేసు వివరాలు తెలియ జేశారు, శ్రీ సత్యసాయి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు, సతీష్ కుమార్ ఉత్తర్వులు మేరకు.. పుట్టపర్తి డి.ఎస్.పి బంగి విజయ కుమార్ ఆదేశాలతో కొత్తచెరువు ఇన్స్పెక్టర్ జి.మారుతి శంకర్, పుట్టపర్తి సిసిఎస్ ఇన్స్పెక్టర్ ఆర్ కే సతీష్ కుమార్, సిసిఎస్ ఎస్ఐ చంద్రశేఖర్, కొత్తచెరువు పి ఎస్ ఐ రాజశేఖర్ సిబ్బంది ఆధ్వర్యములో కొత్తచెరువు అప్ గ్రేడ్ పోలీసు స్టేషన్ పరిధిలో కొత్తచెరువు గ్రామంలోని పూజారి స్ట్రీట్ లో నివసిస్తున్న విశ్రాంతి ఉద్యోగి వేముల శాంతమ్మ కదిరికి వెళ్ళిన సందర్భంలో బీగాలు వేసిన ఆమె ఇంట్లో ప్రవేశించి వారి ఇంటి నందు ఉన్న 20 గ్రాముల బంగారు వాటి విలువ 1,20,000/- దొంగిలించినారని రాబడిన ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వేణుగోపాల్ రెడ్డి (26) తండ్రి లేట్ లక్ష్మారెడ్డి, ఎన్ ఎస్ పి కాలనీ, రామభద్రాపురం గ్రామం, గంగవరం పోస్ట్, తాళ్లూరు మండలం, ప్రకాశం జిల్లా, చిన్నం ఆదెమ్మ,( 42) భర్త లేట్ చిన్నం గోపాల్, 6-124-21, సోమవరప్పాడు గ్రామం, గంగవరం (పోస్ట్), తాళ్లూరు మండలం, ప్రకాశం జిల్లా అని,బాల నేరస్తుడు (మైనర్ బాలుడు) జువైనల్ హోమ్‌కు తరలించారు. ఇటీవల కాలంలో పుట్టపర్తి సబ్ డివిజన్‌లో బుక్కపట్నం, కొత్తచెరువు, పుట్టపర్తి రూరల్ పోలీసు స్టేషన్ల నందు నమోదైన వరుస దొంగతనాలు నేపథ్యంలో కేసులో దర్యాప్తు లో బాగంగా శ్రీ సత్యసాయి జిల్లా ఆదేశాల మేరకు ఈ కేసులో ధర్యాప్తు అధికారి అయిన జీ.మారుతి శంకర్, జిల్లా, పుట్టపర్తి సి సి ఎస్ ఇన్స్పెక్టర్ ఆర్ కే సతీష్ కుమార్, ఉమ్మడిగా పై కేసులో ముద్దాయిలను పట్టుకొను నిమిత్తం నేరస్థలము ఇంటిలో అమర్చబడిన సి సి కెమెరా లోని సి సి ఫూటేజ్ ల ఆధారం చేసుకొని ముద్దాయిల యొక్క వీడియోలను, పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం, సత్యసాయి జిల్లాలోని వివిధ వాటాప్ప గ్రూపులలో పంపించి తద్వారా వారికి ముద్దాయిల గుర్తించి నిన్న అనగా 28.10.2025 వ తేదిన ఉదయం 11.30 గంటల సమయంలో శ్రీ సత్య సాయి జిల్లా, కొత్తచెరువు మండలం, శ్రీ సత్య సాయి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ ఆవరణములో అరెస్టు చేశారు,పది తులాల బంగారు,1250 గ్రాముల వెండి, ఒక నలుపు కలరు సుజుకీ కంపెనీ చెందిన కే ఏ 01.ఎం డి 9404 నంబరు కలిగిన కారు, హీరో హెూండా స్ప్లెండర్ ప్లస్ ఏ పి 29.ఏక్యూ.4694 నెంబరు కలిగిన మోటార్ సైకల్,5 మొబైల్ మొబైల్ సెల్ ఫోన్ల నేరానికి ఉపయోగించిన పరికరాలు రెండు ఇనుప రాడ్లు, 3 స్క్రూ డ్రైవ్ లను, ఏ 1 అదే గ్రామస్తురాలైన ఏ 2 చిన్నం ఆదెమ్మతో పరిచయము ఏర్పడి ఆ తరువాత ఆమెతో అక్రమ సంబంధము ఏర్పడినది. వారి జల్సాలకు మరియు ఇతర ఖర్చులకు గాను దొంగతనములు చేయాలని ఇద్దరం నిశ్చయించు కున్నాము. ఈ విధంగా బైక్ దొంగతనాలు చేస్తూ వాటిని అమ్ముకుంటూ వచ్చిన డబ్బుతో జల్సా చేసుకుంటూ జీవిస్తున్నారు. ఏ1పైన విజయవాడ, ఖమ్మం, గుంటూరు, ప్రకాశం, కర్నూల్, హైదరాబాద్ పోలీసు స్టేషన్ లలో కేసులు నమోదయి వాటిలో ఏ1ను జైలుకు కూడా పంపినారు. తరువాత బెయిల్ మీద బయటికి వచ్చి కొద్దిరోజులు గంజాయి అమ్ముతుండగా ఏ1ను తాళ్ళూరు మరియు పొదిలి పోలీసువారు అరెస్టు చేసి ఏ1పైన గంజాయికేసు పెట్టి జైలుకు పంపినారు. సెప్టెంబర్ నెలలో కడప సెంట్రల్ జైలు నుంచి బెయిల్ మీద వచ్చినాడు. తర్వాత ఏ1ను పుట్టపర్తికి రావాలని నిర్ణయించుకొని, ఆదెమ్మ మరియు ఆమె కొడుకు సాయిలకు తెలిపారు. ఏ1పై వివిధ జిల్లాల్లో కేసులు నమోదై ఉన్నాయి. ప్రకాశం జిల్లా తాళ్ళూరులో, పొదిలిలో, విజయవాడ అర్బన్ క్రైమ్ పీఎస్‌లో, సత్యనారాయణపురంలో, గుంటూరు అర్బన్, కొత్తపేట్, నల్లపాడులో, ఖమ్మం 3టౌన్‌లో, హైదరాబాద్ రాచకొండ పరిధిలోని హయాత్ నగర్‌లో, కర్నూల్ జిల్లా జొన్నగిరి పీఎస్‌లో కేసులు నమోదై ఉన్నాయి. ఈ సందర్భంగా సిబ్బందిని అభినందించిన పుట్టపర్తి డీయస్పి ఈ దొంగతనం కేసులో ముద్దాయిలను చాకచక్యంగా పట్టుకోవడంలో బాగా పనిచేసిన కొత్తచెరువు ఇన్స్పెక్టర్ జీ మారుతి శంకర్, పుట్టపర్తి సి సి ఎస్ ఇన్స్పెక్టర్ ఆర్ కే సతీష్ కుమార్, సి సి ఎస్ ఎస్ ఐ చంద్ర శేఖర్ కొత్తచెరువు పీ ఎస్ ఐ రాజశేఖర్ మరియు వారి సిబ్బంది పుట్టపర్తి డి ఎస్ పి విజయకుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

# శ్రీపురంలో వైఎస్ఆర్సీపీ కోటి సంతకాల సేకరణ





**గుత్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** గుత్తి మాజీ సీఎం వైఎస్ జగన్మో హన్ రెడ్డి ఆదేశాల మేరకు శ్రీపు రం గ్రామంలో గుంతకల్ నియోజ కవర్గం మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు శ్రీపురం గ్రామంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చెవుల మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో కోటి సంత కాల రచ్చబండ కార్యక్రమం. ముఖ్య అతిథిగా విచ్చే సినటువంటి అనంతపురం జిల్లా వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షురాలు గుంతకల్ మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్ నైరుతి రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా నైరుతి రెడ్డి,ఎంపీపీ విశాలాక్షి,సుభాష్ రెడ్డి,మాజీ మా ర్కెట్ యార్డ్ చెవుల సునీల యాదవ్, మైనుద్దీన్ మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టామన్నా రు.వైసిపి కార్యకర్తలు ప్రతి ఒక్క రూ పాల్గొని మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ఆపేందుకు చే యూతని వ్వాలని అన్నారు.కోటి సంతకాల సేకరణ పూర్తి చేసి గవ ర్నరు సమర్పిస్తామన్నారు ఈ కార్యక్రమాల్లో పట్టణ కన్వీనర్ మ ధుసూదన్ రెడ్డి,మాజీ పట్టణ కన్వీ నర్ హు స్సేన్ పీరా,గోవర్ధన్ రెడ్డి ఎం పీపీ విశాలాక్షి ,మాజీ మార్కె ట్ యార్డ్ చైర్మన్ మల్ల య్య యాదవ్,సుభాష్ రెడ్డి,మైను ద్దీన్,మధుసూదన్ రెడ్డి మరి యు గ్రామంలో వైసీపీ సీని యర్ నా యకులు వైసిపి యూత్ లీడర్లు యూత్ మహిళలు గ్రామంలోనే ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు అలాగే మున్సిపల్ కౌన్సిలర్లు వాల్మీకి, శివరాం, వరదరాజులు, వైసిపి నాయకులు జిల్లా ఉపాధ్యక్షు రాలు నైరుతి రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఎంబిబిఎస్ చదవాలనుకున్న విద్యార్థులు కలలు చెడిపేయడానికి పూను కుందని మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేస్తే బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఎంబిబిఎస్ చదివి డాక్టర్ అనుకున్న విద్యార్థుల ఆశయాలపై నీళ్లు చల్లినట్లు అవుతుందని మాజీ మంత్రి వైఎ స్ జగన్ మోహన్ రెడ్డి 17 మెడిక ల్ కాలేజీ లను నిర్మిస్తే కొనసాగించాలి గాని ప్రైవేటీకరణ చేసి అధికార కూటమి ప్రభుత్వ నాయకులు కాలేజీలు పెట్టుకున్న వారికి ప్రయోజనం చేకూర్చేందుకు ఎస్సీ బీసీ మైనారిటీ కులాల విద్యార్థులు ఎంబిబిఎస్ చదవాలనుకుంటున్న విద్యార్థుల కలలను అరిస్తుందని రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం త్వరలోనే దించడానికి ఇలాంటి పాలన నమ్మించి మోసం చేస్తానని చంద్రబాబు గురించి మరల చెప్పాల్సిన అవసరం లేదు ఉచిత బస్సు వల్ల ప్రయోజనం ఏముంది ప్రజలకు పని కొచ్చే కార్యక్రమాలు చేపట్టాల ని సంవత్సరాల కాలంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు విద్యకి వైద్యానికి అధిక ప్రాధా న్యతను ఇచ్చి ముం దుకు దే శంలోనే మన రాష్ట్రంలో నా డు నేడు ప్రభుత్వ బడులను మార్చేసిన ఘనత మన సీఎం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని మేము కార్యకర్తలారా గర్వంగా చెబుతాం ముద్దు నిద్ర లో ఉన్న ప్రభుత్వాన్ని నిద్రలేవడా నికి బోటి సంతకాల సేకరణతో ప్రతి ఒక్కరూ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వద్దు.పూర్తిగా గవ ర్నమెంట్ ఆధీనంలో కొనసాగిం చాలని వారు డిమాండ్ చేశారు అదేవిధంగా మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చెవుల సునీల యాదవ్ మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అభివృ ద్ధి కార్యక్రమాలు ప్రజలకు అవ సరమయ్యే విధంగా పరిపాలన ప్రజల వద్దకే తీసుకొచ్చాడని ఆ నాడు గాంధీజీ చెప్పిన గ్రామ స్వ రాజ్యం వైఎస్ జగన్మోహన్ రెడ్డి తోనే సాధ్యమని విద్యార్థులకు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ విద్యా దీవెన వసతి దీ వెన అమ్మ ఒడి పథకాలతో విద్య కు పెద్దపీట వేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారిని అని చెప్పుకొచ్చారు ఈ కార్యక్రమాల్లో పట్టణ కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, మాజీ పట్టణ కన్వీనర్ హుస్సేన్ పీరా, గోవర్ధన్ రెడ్డి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మ న్ మల్లయ్య యాదవ్ మరియు గ్రామంలో వైసీపీ సీనియర్ నాయ కులు వైసిపి యూత్ లీడర్లు యూ త్ మహిళలు గ్రామంలోనే ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు అలాగే మున్సిపల్ కౌన్సిలర్లు వాల్మీకి శివ రాం,వరదరాజులు, రామ్ రంగారెడ్డి, గుత్తి పట్టణ సీనియ ర్ నాయకులు అందరూ పాల్గొన్నారు.

# రోడ్లు, కాలువలు బాగు చేయాలని సంతకాల సేకరణ: సీపీఎం



**నాయుడుపేట, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** నాయుడుపేట మున్సిపాలిటీ వీధులలో మురికి నీటితో రోడ్లు జలమయం తో ఉన్న అధికారులు రాజకీయ నాయకులు పట్టించుకోవడంలేదని ఈరోజు సిపిఎం పార్టీ అవాజ్ సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంతకాలు సేకరణ చేపట్టారు ఈ సందర్భంగా సిపిఎం పార్టీ శివకవి ముకుంద సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మమ్మ గారు మస్తాన్ రెడ్డి మాట్లాడుతూ గతలో పంచాయతీ నిధులతో వేసిన రోడ్లు కాలువలు పంచాయితీ నుండి జనాభా మున్సిపాలిటీ ఆదాయం పెరగడంతో మున్సిపాలిటీ చేశారని అప్పట్నుండి ఇప్పటివరకు రోడ్లు కానీ కాలవలు కానీ వేయడం జరగలేదని ప్రజల వద్ద నుండి ఇంటి పన్నులు రకరకాల పనులు వసూలు చేస్తున్నారే కానీ మున్సిపాలిటీ డెవలప్మెంట్ కి ఆ డబ్బుని ఖర్చు చేయడం లేదని సిపిఎం ప్రజాసంఘాలు కలిసి ఇంటింటికి తిరిగి సంతకాలు సేకరించి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ గారికి జిల్లా కలెక్టర్ గారికి లోకేష్ బాబుకి పంపితే అయినా మున్సిపాలిటీ బాగుపడతాదని సంతకాల సేకరణ చేపట్టడం జరిగిందని వారు అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సతీష్ అబ్దుల్లా అవాజ్ కమిటీ నాయకులు హలీం ఖాన్ మాట్లాడుతూ ఎలక్షన్ వస్తే ఇంటింటికి తిరిగి ఓట్లు వేయమని ప్రదాయపడతాం మీకు రోడ్లు కాలువలు లైటింగ్ లైట్లు వేసి నాయుడుపేట మున్సిపాలిటీని సుందరవణంగా తయారు చేస్తామని వాగ్దానాలు చేస్తున్నారే కానీ ఎలక్షన్ గెలవడం తరువాయి రాజకీయ నాయకులు సంపాదన మీద చూసుకుంటున్నారే కానీ ప్రజా సమస్యల మీద ఏమాత్రం కృషి చేయడం లేదని మళ్లీ ఎలక్షన్ రాబోతున్నాయని ప్రజలు బుద్ధి చెప్తారని వారు అన్నారు ఆవాజ్ సిఐటియు నాయకులు హలీమ్ ఖాన్ ఎస్.కె అబ్దుల్లా మాట్లాడుతూ మొధ తుఫాన్ కి ప్రజలు ఇళ్లలో నుండి బయటకు రావడానికి భయప్రాంతులకు గుర య్యారు. నిత్యవసర సరుకులు కొనడానికి బయటికి వస్తే ఎక్కడ రోడ్డు ఉందో ఎక్కడ గుంతలు ఉన్నాయా తెలియ చాలామంది గుంతల్లో పడి ప్రమాదాలకు గుర య్యారని తుఫాన్ కి అధికారులు అన్ని వీధులు తిరిగి ఉంటే వారికి ఇక్కడ పరిస్థితులు కనపడలేదని అడుగు తున్నారూ స్థానికులు ఆవేదన వ్యక్తంచేశారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శ్యామలమ్మ విజయమ్మ ఉసేనమ్మ తదితరులు పాల్గొన్నారు.

Truth of News
సూర్య వాస్తవం
RNI NO : APTEL/25/A0239
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్



# కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి

## విద్యార్థులకు జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ సూచన

## వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం





**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** ప్రతి విద్యార్థి బాగా కష్టపడి చదివి, భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమలలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన వకృత్వ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సెమినార్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీగత వారం రోజులుగా, జిల్లా పోలీస్ శాఖ ( ఏ.ఆర్ ) ఆధ్వర్యంలో కళాశాల, పాఠశాల ,విద్యార్థిని విద్యార్థులతో పాటు పోలీస్ సిబ్బంది, వారి పిల్లలకు వ్యాసరచన వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణలో తమ ప్రాణాలు అర్పించిన సోదరుల,త్యాగం వల్లే మనం నేడు సురక్షితంగా జీవిస్తున్నామని వారి త్యాగాలను భావితరాల వారికి తెలియజేయడమే పోలీస్ అమరవీరుల వారోత్సవాల యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో మీరందరూ పాల్గొనడం ఎంతో సంతోషకరమని ఎస్పీ తెలియ జేశారు,ఈ కార్యక్రమానికి హాజరైన రిటైర్డ్ ప్రిన్సిపాల్ వాసుదేవరెడ్డి, మాట్లాడుతూ అమరులైన పోలీసుల యొక్క త్యాగాలను గుర్తు చేస్తూ, ప్రతిఏటా పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు ఎందుకు నిర్వహిస్తున్నారు అన్న విషయాలను విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా సమాజంలో జరుగుతున్న, నేరాలు, సైబర్ మోసాలు, మత్తు పదార్థాలు వాటి వల్ల కలిగే అనార్థాలు గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ సందేశాలను తెలియ జేశారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ వాసుదేవరెడ్డిని జిల్లా ఎస్పీ శాలువాతో సత్కరించి సన్మానించారు,ఈ కార్యక్రమంలో, ఏ ఆర్ డి ఎస్ పి శ్రీనివాసులు, ఎస్బిసిఐ వెంకటేశ్వర్లు, ఆర్ ఐ లు వలి, మహేష్, రవికుమార్, ఆర్ఎస్ఐ ప్రదీప్ సింగ్, ఏఆర్ సిబ్బంది రామంజి, భాస్కర్, పోలీస్ సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

**విజేతలు వీరే.. మొదటి, రెండవ, మూడవ బహుమతులు**

ఎస్సే రైటింగ్.. **పాఠశాల కళాశాల విద్యార్థులు..** విజయతి, టెన్త్ క్లాస్ జిల్లా పరిషత్ పాఠశాల కేసాపురం. గీతిక, టెన్త్ క్లాస్ గాండ్లపెంట, మనీషా సంస్కృతి ఇంజనీరింగ్ కాలేజ్. **పోలీసు పిల్లలు..** అనూష, హైందవి, సిరిశ్రీ **పోలీస్ సిబ్బంది..** పెద్దారెడ్డి, ఏఆర్, జబీఉల్లా ఆమడగురు పిఎస్, నర్మదా, పీజిఆర్ఎస్ పుట్టపర్తి,

వక్తృత్వ పోటీలలో.. **పాఠశాల కళాశాల విద్యార్థులు..** మౌనిక సంస్కృతి ఇంజనీరింగ్, తనుషాచంద్ర ,బాలాజీ కాలేజ్ హిందూపురం, హిమబిందు ఎం జె పి ఎస్ టేకులేడు, **పోలీస్ పిల్లలు..** చక్రవర్తి , యశ్వంత్ నాయక్, పనీత్ నాయక్.. **పోలీస్ సిబ్బంది..** శ్యామల, పిజిఆర్ఎస్ వెంకటేశ్వరరావు ఏఆర్, పద్మశ్రీ,ఏఆర్.

## భూ సమస్యలు పరిష్కరించాలి

- జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



**అనంతపురం కలెక్టరేట్, సూర్య వాస్తవం, అక్టోబర్ 29 :** జిల్లాలో ఆయా ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ లేకుండా భూ సమస్యలు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వివిధ ప్రాజెక్టులకు భూసేకరణ, భూ బదలాయింపు, రీ సర్వే, ఈ పంట నమోదు మరియు కేంద్ర ప్రభుత్వ పథకం అయిన ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు మరియు ఇతర రెవెన్యూ అంశాల గురించి జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులు (ఎన్హెచ్) 67, 510ఏ, 544, 52లకు సంబంధించి పెండింగ్ ఉన్న అనెగ్జర్స్, రిపోర్టులు పంపించాలన్నారు. వివిధ రైల్వే ప్రాజెక్టుల పరిధిలో భూములకు సంబంధించి పెండింగ్ ఉన్న నివేదికలను ఆర్డీఓలు పంపించాలన్నారు. మాజీ సైనికులకు అసైన్మెంట్ భూమి కేటాయించేందుకు సర్వే చేసి ప్రతిపాదనలు తయారుచేసి వచ్చే నెల 10వతేదీలోపు కలెక్టరేట్ కు పంపించాలని సూచించారు. కంబదూరు, గుత్తి పరిధిలో సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం లీజుకు సంబంధించి సర్వే పూర్తి చేసి నివేదికలు అందించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ఆయా మండలాల తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల విధులు, వినియోగించే ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన



**అనంతపురం క్రైమ్, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు వివిధ అంశాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. ముఖ్యంగా పోలీసుల విధులు, వారు వినియోగించే ఆయుధాలు, పరికరాల పనితీరు మరియు రికార్డుల నిర్వహణ గురించి అవగాహన చేశారు. రిసెప్షన్ సెంటర్లు ఎస్హెచ్ఓ కార్యాలయం, విహెచ్ఎఫ్ సెట్ , డయల్ 100/112, వివిధ రకాల తుపాకుల పనితీరు గురించి అవగాహన చేశారు. విద్యార్థి దశనుండే పోలీసుల విధుల పట్ల అవగాహన కలిగి ఉండడం భవిష్యత్తులో ఎంతో దోహదం చేస్తుందని సూచించారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని ఉత్తేజంగా పోలీసుల సూచనలు స్వీకరించారు.



# పేదల వైద్యం, విద్యను అమ్మకానికి పెడుతున్న కూటమి ప్రభుత్వం

## మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మండిపాటు - పెళ్లకూరు మండలంలో కోటి సంతకాల సేకరణ ప్రారంభం







**పెళ్లకూరు, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై మాజీ ఎమ్మెల్యే, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య విద్యను, పేదల ఆరోగ్య హక్కులను కూడా కూటమి ప్రభుత్వం వ్యాపారంగా మార్చాలని చూస్తోందని ఆయన మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, మాజీ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి సూచనలతో ం పెళ్లకూరు మండలంలోని చింతపూడి, పుల్లూరు, ముమ్మారెడ్డిగుంట గ్రామాల్లో వైయస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సంజీవయ్య రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. సంజీవయ్య మాట్లాడుతూ, "పేద విద్యార్థులకు ఉచిత వైద్యవిద్య అందించాలనే లక్ష్యంతో వైయస్ జగన్ గారు కేవలం రెండేళ్లలోనే 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టారు. వాటిలో ఐదు కాలేజీలు ఇప్పటికే విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. మిగిలిన వాటిని పూర్తి చేయాల్సింది పోయి, కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటు చేతుల్లోకి ఇవ్వడానికి కుట్ర పన్నుతోంది," అన్నారు. అలాంటి నిర్ణయాలు పేదల భవిష్యత్తుపై కత్తి పెట్టడమేనని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని తెలిపారు. తన అనుచరులకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను అప్పగించి వేల కోట్లు దండుకోవాలనే దురుద్దేశంతో చంద్రబాబు నడుస్తున్నారని సంజీవయ్య తీవ్ర విమర్శలు గుప్పించారు. "పేదలంటే చంద్రబాబుకు ఎందుకంత చులకన? ప్రజా హక్కులను అమ్మేసి, ధనికుల కోసం పాలసీలు రూపొందిస్తున్నాడు. ఈ ద్రోహాన్ని ప్రజలు ఖచ్చితంగా నిలదీస్తారు," అని అన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

**"కోటి సంతకాల సేకరణతో ప్రజా చైతన్యం ప్రారంభం"**

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ ప్రారంభమైందని, ఆ సంతకాలను త్వరలో గవర్నర్‌కు సమర్పిస్తామని సంజీవయ్య వెల్లడించారు. నవంబర్ 4న రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నాయకులు, ప్రజలు, అనుబంధ విభాగాలు కలిసి పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, మండల కన్వీనర్ ఒబ్బు వెంకటరత్నం, ఎంపీపీ శేఖర్ రెడ్డి, జడ్పీటిసి సన్నం ప్రిస్కిల్లా, సర్పంచులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పుట్టపర్తిలో 10లోగా ఇంజనీరింగ్ పనులను పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్



**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 29:** శ్రీసత్యసాయి శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో... పుట్టపర్తిలో నవంబర్ 10లోగా చేపట్టిన ఇంజనీరింగ్ పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ ఇంజనీరింగ్ శాఖల అధికారులను ఆదేశించారు,బుధవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో... పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, మున్సిపల్ పబ్లిక్ హెల్త్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, హెచ్ ఎం ఎస్ ఎస్ తదితర ఇంజనీరింగ్ శాఖల అధికారులతో పుట్టపర్తిలో శ్రీ సత్య సాయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా చేపట్టిన పనుల ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారూ,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పర్యాటక శాఖ ద్వారా రూ.10 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సదరు నిధులతో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఇప్పటికే చేపట్టిన పనులన్నింటిని నవంబర్ పదిలోగా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఆయా శాఖల ద్వారా ఎన్ని పనులు చేపట్టారు, మొత్తం ఖర్చు, ఇప్పటివరకు పూర్తయిన పని, ఇంకను చేయాల్సిన పని ఎంత, ఎప్పటిలోగా పూర్తి చేస్తారన్న నివేదికను తనకు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. చిత్రావతి నది ట్యాంక్ బండ్ పొడవునా సుందరీకరణ పనులు జరుగుతున్నాయని, అక్కడ వాచ్ అండ్ వార్డ్ ఉండాలన్నారు. పారిశుద్ధ పనులకు ఎంతమంది కార్మికులను తీసుకున్నారు, ఎన్ని ట్రాక్టర్లు ఏర్పాటు చేస్తున్నారు, త్రాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాట్లు తదితరాలపై నివేదిక సమర్పించాలని పబ్లిక్ హెల్త్ శాఖను ఆదేశించారు. జల వనరుల శాఖ, హెచ్ ఎన్ ఎస్ ఎస్, ఆర్డబ్ల్యూఎస్ శాఖల ద్వారా చేపట్టిన పనుల ప్రగతిపై కూడా సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. ఆర్ అండ్ బి ద్వారా చేపట్టిన పనులను కూడా వేగవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు, ఈ సమావేశంలో డిఆర్ఓ సుదర్శన్ రెడ్డి, సిపిఓ విజయ్ కుమార్, పబ్లిక్ హెల్త్ ఈఈ నరసింహ, పిఆర్ ఎస్ఈ క్రాంతి, డిఆర్డిఏ పిడి నరసయ్య, వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (ASSOCIATE EDITOR -N.ARIF ALI ) CELL : 80740 10854